

మంత్రులకు..ర్యాంకులు

మంత్రుల పనితీరుకే కాదు.. ఫైల్స్ క్లియరెన్స్‌కు ర్యాంకులు ఉంటాయి.. తాజాగా ఆ ర్యాంకులను కేటాయించారు. ఇటీవల సీఎం చంద్రబాబు రాష్ట్ర మంత్రులు తమ శాఖల పరిధిలో ఫైళ్లను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు గురువారం జరిగిన కేబినేట్ సమావేశంలో దీనిపై చర్చించారు. అనంతరం ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రుల పనితీరు ఎలా ఉందనేదానిపై సీఎం ర్యాంకులు ప్రకటించారు. అందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కందుల దురేష్ రెండో ర్యాంకులో నిలిచారు.. ఇక కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పదో ర్యాంకు.. బీఆర్ అంబేద్కర్ జిల్లా రామచంద్రపురం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వాసంశెట్టి సుభాష్ 25 ర్యాంకులో నిలిచారు. ఈ ర్యాంకులను కేబినెట్ సమావేశంలో సీఎం చంద్ర బాబునాయుడు స్వయంగా ప్రకటించడం గమనార్హం.

మంత్రి దుర్గేష్ 2



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఫైళ్ల క్లియరెన్స్‌లో తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు 2వ ర్యాంకు లభించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏ మంత్రి ఎన్ని ఫైళ్లు క్లియర్ చేశారనే దానిపై సీఎం చంద్రబాబు ర్యాంక్‌లు ప్రకటించారు. అందులో మంత్రి కందుల దుర్గేష్‌కు 2వ ర్యాంకు లభించింది. రెండో ర్యాంకు సాధించిన మంత్రి దుర్గేష్ సుమారు 120 ఫైళ్లు క్లియర్ చేసినట్టు చెప్పారు. దీనిపై ఆయనను సంప్రదించగా తాను పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేశానని, అందులో టూరిజం శాఖకు చెందినవే అధికంగా ఉన్నాయన్నారు. మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ఈ ర్యాంకు ప్రోత్సహిస్తుందని చెప్పారు.

పవన్‌కల్యాణ్ 10



కాకినాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత, డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ ఫైళ్ల క్లియరెన్స్‌లో 10వ ర్యాంకులో నిలిచారు. పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రుల ఫైళ్ల క్లియరెన్స్‌పై సీఎం ర్యాంకులు ప్రకటించారు. అందులో భాగంగా డిప్యూటీ సీఎం, జిల్లా మంత్రి పవన్ కల్యాణ్ పదో ర్యాంకులో నిలిచారు. ఇకపై మరింత వేగవంతమైన పనితీరు అందించే క్రమంలో మంత్రులు మరింత చురుగ్గా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. పవన్‌కల్యాణ్ అత్యంత కీలకమైన శాఖలు చూస్తున్నారు. వీటికి సంబంధించి ఎప్పటికప్పుడు ఫైళ్లను క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిని పరిష్కరిస్తున్నారు. అలాగే రాష్ట్రంలో పలుచోట్లకు తరచూ పర్యటిస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఫైళ్ల క్లియరెన్స్‌కు కాస్త ఆలస్యం అవుతున్నా వాటిని పూర్తిగా అధ్యయనం చేస్తున్నారు.

సుభాష్ 25



అమలాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నుంచి కార్మికశాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న వాసంశెట్టి సుభాష్ ఫైళ్ల క్రియరెన్సులో చివరిస్థానం 25లో నిలిచారు. కోనసీమకు చెందిన మంత్రి సుభాష్ ఫైళ్ల పరిష్కారంలో చివరిస్థానంలో ఉండడంతో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పార్టీ సభ్యత్వ నమోదు విషయంలో ఒకసారి అధినేత చంద్రబాబునాయుడుతో మందలింపునకు గురైన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ర్యాంకుల్లో చివరి ర్యాంకు రావడంతో మంత్రి సుభాష్ రాగల రోజుల్లో మరింత కష్టించి పనిచేయాల్సి ఉంటుందని ఆయన సన్నిహితులు సూచనలు చేస్తున్నారు. సుభాష్ పనితీరు పట్ల కొన్ని వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

కోకో గిట్టుబాటు ధరకు ప్రభుత్వ ప్రణాళికలు

అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌కు కోకో ఉత్పత్తులు

కోనసీమ జిల్లాను కోకో హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పి.గన్నవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కోకో పంటకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌లో పలికే గిట్టుబాటు ధర క్షేత్రస్థాయిలో రైతుకు చేరే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కోనసీమ జిల్లాలో కొబ్బరిలో కోకోను అంతర పంటగా అభివృద్ధి చేసి జిల్లాను కోకో హబ్‌గా తీర్చిదిద్దాలని రైతులకు ఆయన సూచించారు. ముంగండలోని రైతులు కేవీ రమణ, ఖండవల్లి నాగేశ్వరరావు కొబ్బరి తోటలో కోకో పంటను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న ధర క్షేత్రస్థాయిలో రైతుకు అందడంలేదని ధరల్లో వ్యత్యాసం ఉంటు ందన్నారు. దీంతో ప్రభుత్వమే కోకో పంటను అభివృద్ధి చేసి పంటను నిల్వచేసే విధంగా స్థానికంగా రైతులకు గోదాములు ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంపై ప్రభుత్వం పరిశీలన చేస్తోందన్నారు. సంబంధిత కంపెనీలే ప్రభుత్వం ఆధ్వర్యంలో నేరుగా పంట ఉత్పత్తులను గోదాముల నుంచి కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. కోకో ఉత్పత్తులకు మార్కెటింగ్ డిమాండ్‌ను అనుసరించి గిట్టుబాటు ధరలు లభిస్తాయని ఆ దిశగా కోనసీమలో అంతర పంటగా కోకోను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని తెలిపారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా కోకో విస్తీర్ణం ఎంత మేర ఉంది విశ్లేషించి సాగు విస్తీర్ణాన్ని అభివృద్ధి చేసే దిశగా అధ్యయనం చేస్తున్నట్టు వివరించారు. అనంతరం రైతులతో మాట్లాడిన ఆయన కోకో కాయలను పరిశీలించి ప్రాసెసింగ్ విధానాన్ని, చాక్లెట్ తయారీ అంశాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యానవన అధికారి కేవీ రమణ, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఉద్యానవన అధికారి దిలీప్‌కుమార్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ కుసుమ చంద్రకళ, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, పెచ్చెట్టి వెర్రియ్య, సరెళ్ల అప్పారావు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దేవాలయాలకు పూర్తి సహకారాలు: జేసీ

అమలాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 26న జిల్లాలోనే వివిధ దేవదాయ, ధర్మదాయ శాఖ పరిధిలోని దేవాలయాలకు జిల్లా యంత్రాంగం నుంచి సహాయ సహకారాలు అందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. కలెక్టరేట్‌లో గురువారం మహాశివరాత్రి నిర్వహణ ఏర్పాట్లతో పాటు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి, వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి, మందపల్లి శనేశ్వరస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, కోటిపల్లి సోమేశ్వరస్వామి, అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానం, పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి ఆలయం, ర్యాలి జగన్మోహని దేవస్థానం, మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించే దేవస్థానాల అధికారులు వారికి అవసరమైన శాంతి భద్రతల పరిరక్షణ, అదనపు సిబ్బంది, వసతుల కల్పన వంటి సహకారానికి సంబంధించి ముందుగానే ప్రతిపాదనలు పంపితే జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు సమకూరుస్తుందన్నారు. స్నాన ఘట్టాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, దేవదాయ ధర్మదాయశాఖ ఉప కమిషనర్ డీఎల్వీ రమేష్, వాడపల్లి, ద్రాక్షారామ దేవస్థానం అధికారులు ఎన్ఎస్ చక్రధరరావు, ఏవీ దుర్గాభవానీ, కార్యనిర్వాహక ఇంజనీర్ ముదునూరి సత్యనారాయణరాజు, వివిధ దేవస్థానాల ఈవోలు, సిబ్బంది సమీక్షలో పాల్గొన్నారు.

పేదల గుర్తింపునకు 10 నుంచి చట్టబద్ధ సర్వే



స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో భాగంగా నిర్వహణ

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పేదరికంలో అట్టడుగున ఉన్న 20శాతం మందిని గుర్తించేందుకు మార్చి 10 నుంచి చట్టబద్ధమైన సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో మొదటి సూత్రమైన జీవో ప్రోవర్టీ లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్ పి-4 విధానాన్ని రూపొందించిందన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తొలుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లాస్థాయి అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతీ ఒక్కరి జీవన ప్రమాణాలను పెంచేందుకు జన్మభూమి స్ఫూర్తితో పీ-4 విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. పేదలు ఆర్థిక సంస్కరణలతో ఉన్నత స్థితికి చేరుకోవాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. పేదలను గుర్తించే సర్వే మార్చి 20 వరకు చట్టబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. సర్వే ద్వారా గుర్తించిన పేదలకు ప్రభుత్వ పథకాలు, సీఎస్సార్ నిధులు, ఎన్ఆర్ఐల సహకారంతో కనీస జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. సర్వేలో పంచాయతీరాజ్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొంటారన్నారు. కాలుష్య నియంత్రణ నిర్వహణలో భాగంగా జిల్లాలో సమగ్ర బయోగ్యాస్ యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. సీపీవో వెంకటేశ్వర్లుతో పాటు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసే విధంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. 10వ తేదీన మాత్రలు పంపిణీ చేయగా మిగిలిన పిల్లలకు 17న మాత్రలు అందించాలని సూచించారు. మాత్రలు వేసే విధానాన్ని తెలియచేశారు. జిల్లాలో 3,04,318 మంది పిల్లలు ఉండగా 3.40 లక్షల ఆల్బెండజోల్ మాత్రలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

అవినీతి.. రత్నాలు!



గత ప్రభుత్వంలో ఆలయాలు దోచుకోవడానికి అడ్డాలుగా మారిపోయాయి.. దాదాపు అన్ని దేవస్థానాల్లోనూ అవినీతి.. అక్రమాలు రాజ్యమేలాయి.. అన్నవరం సత్యదేవుడి ఆలయంలోనూ అసత్యం రాజ్యమేలింది.. విజిలెన్స్ అధికారులు ఆలయంలో అక్రమాలు.. అవినీతి జరిగిందని నివేదిక ఇచ్చినా కూటమి ప్రభుత్వంలోనూ ఇంతవరకు చర్యల్లేవ్. అన్నవరం దేవస్థానం ఎంతో ప్రఖ్యాతి చెందింది. ఏళ్లు గడుస్తున్నా ఆలయంలో అక్రమార్కులపై కనీస చర్యలు లేకపోవడంతో దొంగలంతా దర్జాగా వ్యవహరిస్తున్నారు. కొండపై ప్రక్షాళన వట్టిమాటే అన్నట్టు ధీమా ప్రదర్శిస్తూ చక్రం తిప్పుతున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రత్నగిరి కొండపై అక్రమాలకు అడ్డేది

- అన్నవరంలో అక్రమాలపై నివేదిక
- గత ప్రభుత్వంలో విజిలెన్స్ దాడులు
- నిధులు దుర్వినియోగంపై తేల్చివేత
- గొంది ఆలయ భూముల కబ్జా
- 38 ఎకరాలపై విన్నపం
- ఏళ్లు గడుస్తున్నా మౌనమే
- కూటమిలోనూ అక్రమార్కుల దర్జా
- విజిలెన్స్ నివేదికపై నేటికీ చర్యల్లేవ్
- ఈ సర్కారులోనూ ఇంతేనా?
- ఇప్పటికీ చక్రం తిప్పుతున్న వైనం

అన్నవరం దేవస్థానంలో అవినీతి గుట్టు బయటపడినా అక్రమార్కులపై ఇప్పటికీ చర్యలకు అడుగులు పడడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో కచ్చితంగా చర్యలు ఉంటాయని భావించినా ఇంకా ఆ దిశగా ప్రక్షాళన జరగకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొండపై పలు రకాల అవినీతి, అక్రమాలు పేరుకుపోయాయని సాక్షాత్తూ ఆధారాలతో విజిలెన్స్ నివేదిక తయారుచేసి పంపినా గత వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. పైగా ఇవన్నీ బయటపడితే కొలువులు పోతాయని కొందరు కీలక అధికారులు బెంబేలెత్తిపోయారు. అక్రమాలపై చర్యలు లేకుండా అప్పట్లో తెగ చక్రంతిప్పారు. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో విజిలెన్స్ నివేదిక ప్రకారం చర్యలు ఉంటాయని భావిస్తే ఇప్పటికీ సదరు అక్రమార్కులు ఆ నివేదిక బయటకు రాకుండా ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టడానికి ప్రయత్నిస్తుండడం విశేషం. మరోపక్క అప్పటి నివేదికలను విజిలెన్స్ అధికారులు కొత్త కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కానీ ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలకు దిగిన ఆనవాళ్లు లేవు. వాస్తవానికి కొండపై అడ్డగోలుగా ఉద్యోగుల భర్తీ, పదోన్నతులు, దుకాణాల లీజులు, ఈవో బంగ్లా నిర్మాణం వరకు పలు రకాలుగా అక్రమాలు, అవినీతి జరిగినట్టు విజిలెన్స్ తేల్చింది.

ఇన్నేళ్లయినా.. చర్యలేవి!

అన్నవరం దేవస్థానంలో 2019 నుంచి పలు విభాగాల్లో అక్రమాలు భారీగా చోటుచేసుకున్నాయి. ఓ కీలక అధికారి, కొందరు సెక్షన్ ఉద్యోగులతో కుమ్మక్కై అర్చకులు, ఉద్యోగాల నియామకాల్లో పెద్దఎత్తున మేసేశారు. జీతాల పేరుతో దేవస్థానం నిధులను దిగమింగేశారు. బస్సుల నిర్వహణ, కొండ కింద ఈవో బంగ్లా నిర్మాణానికి దేవస్థానం నిధుల నుంచి రూ.కోటి వరకు వెచ్చించారు. గోశాల నిర్వహణలో సైతం అక్రమాలు భారీగా ఉన్నాయి. అడిగేవారు లేరన్న ధీమాతో అప్పట్లో కొందరు అధికారులు, ఉద్యోగులు కలిసి దేవస్థానం సొమ్ములు మింగేశారు. వీటన్నింటిపైనా భక్తుల నుంచి 2021లో అప్పటి ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో కొండపై అవినీతి బాగోతం తేల్చడానికి ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు రంగంలో దిగారు. 2021 డిసెంబరు 20 నుంచి విజిలెన్స్ ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కొండపై కొన్నిరోజులు దాడులు నిర్వహించాయి. ట్రాన్స్‌పోర్టు, ఉద్యోగుల భర్తీకి సంబంధించి సెక్షన్లలో కీలక అధికారులు, ఉద్యోగుల నుంచి వివరణలు రికార్డు చేసుకున్నారు. దేవస్థానంలో అక్రమ నియామకాలు, పదోన్నతులు, లీజుల విభాగంలో అక్రమాలు, ఈవో క్వార్టర్ నిర్మాణంలో భారీగా ఆలయ నిధులు మింగేశారనే అంశాలపైనా విచారణ చేపట్టారు. ఈ ఖర్చులకు సంబంధించిన బిల్లులు, ఇతర రికార్డులను విజిలెన్స్ పరిశీలించింది. దేవస్థానానికి సమీపంలో నిర్మాణంలో ఉన్న కొన్ని భవనాల కొలతలు తీసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వానికి 2022లో విజిలెన్స్ పూర్తి నివేదిక పంపింది. కొండపై అనేక అవినీతి, అక్రమాలు జరిగినట్టు తేల్చింది. రౌతులపూడి మండలం గొందిలో ఆలయానికి 38 ఎకరాల భూమి ఉండగా దానిలో చాలా వరకు అక్రమార్కులు పాగా వేసేశారని దీనికి కొందరు అధికారుల సహకారం ఉందని వివరించింది. బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ నివేదికపై చర్యలు తీసుకుంటే కొలువు పోతుందనే భయంతో ఇక్కడ ఈవోగా పనిచేసి వెళ్లిపోయిన సదరు కీలక అధికారి విజిలెన్స్ నివేదికపై చర్యలు లేకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలను దారికి తెచ్చుకున్నారు. దీంతో అక్రమాలు బయటపడినా నివేదికను తొక్కి పెట్టేసేలా చేయగలిగారు. ప్రభుత్వం నుంచి ఏ స్పందనా లేకపోవడంతో విజిలెన్స్ సైతం పట్టువదిలేసింది.

ఇప్పుడూ అంతే.. చర్యల్లేవంతే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలుపైగానే అయిపోయింది. అయినా ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు లేవు. వాస్తవానికి ప్రభుత్వం వచ్చిన కొత్తలో విజిలెన్స్ అధికారులు గత ప్రభుత్వంలో అక్రమాలకు సంబంధించి అన్ని వివరాలు అందించారు. అయినా ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వంలోను సదరు కీలక అధికారి చక్రం తిప్పుతున్నారనే అనుమానాలున్నాయి. ప్రత్తిపాడు, తుని ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అన్నవరం దేవస్థానం అక్రమాలపై విజిలెన్స్ నివేదికలు ఏమయ్యాయని నిలదీసి ఉంటే ఈపాటికి చర్యలకు అవకాశం ఉండేది. కానీ ఈ దిశగా ప్రయత్నాలు లేకపోవడంతో దొంగలు కొండపై తమ దందాలు సాగిస్తున్నారు. విజిలెన్స్ నివేదికను రప్పించుకుని అక్రమార్కులపై చర్యలు తీసుకునేలా కలెక్టర్ అయినా చొరవ తీసుకోవాల్సి ఉంది.

బలహీన ఏటిగట్ల పటిష్టానికి రూ.14.36 కోట్లు మంజూరు



మానేపల్లిలో వరదల సమయంలో ఇసుక బస్తాలను రక్షణగా ఏర్పాటు చేసిన దృశ్యం (ఫైల్ ఫొటో)

పి.గన్నవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సాగునీటి పంపిణీ వ్యవస్థతో పాటు ముంపు సమస్య, బలహీన ఏటిగట్లు సమస్య పరిష్కరించేందుకు గాను కూటమి ప్రభుత్వం వరద నియంత్రణ ప్రాజెక్టు నిధులు రూ.14.36 కోట్లు మంజూరు చేసింది. కోనసీమ జిల్లాలోని పలు గోదావరి తీర ప్రాంతాలలో పురాతన అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు దెబ్బతిన్నాయి. దీంతో వరదలు, భారీ వర్షాలు సమయంలో మేజర్, మైనర్ డ్రైన్‌లు నుంచి ముంపు నీరు దిగక ఆ ప్రాంత పొలాలతో పాటు పలు కాలనీలు సైతం నీట మునుగుతున్నాయి. అంతే కాకుండా ఏటిగట్లు బలహీనంగా ఉండటంతో వరదల సమయంలో ఇసుక బస్తాలను రక్షణగా ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఉంది. 2006లో వచ్చిన వరదలకు కోనసీమలోని పలు చోట్ల ఏటిగట్లకు గండ్లు కూడా పడ్డాయి. దీంతో అప్పటి ప్రభుత్వం 1986 వరదలను దృష్టిలో ఉంచుకుని ఏటిగట్లు బలపర్చింది. ఆ సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలుచోట్ల న్యాయపరమైన అడ్డంకులు, స్థానికంగా ఇబ్బందులు రావడంతో సుమారు 30 కిలోమీటర్ల మేర ఏటిగట్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ఇటీవల సంభవించిన వరదలను దృష్టిలో ఉంచుకుని పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు నిమిత్తం రూ.20.88 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. ఇటీవలే వరద నియంత్రణ ప్రాజెక్టులు నిధులు రూ.14.36 కోట్లు మంజూరయ్యాయి. వైనతేయ కుడిగట్టు నాగుల్లంక, మానేపల్లి, పాశర్లపూడి గ్రామాలలో సుమారు 16 కిలోమీటర్లు మేర ఏటిగట్టు అభివృద్ధికి రూ.96 లక్షలు మంజూరయ్యాయి. అలాగే వైనతేయ కుడిగట్టు మామిడికుదురు మండలంలోని టూటుకుర్రు, ఆదుర్రు, గోగన్నమఠం గ్రామాల పరిధిలోని వడబోది, బచ్చులబండ, కడలి మైనర్ డ్రైన్‌లలో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామ పరిధిలోని వశిష్ట ఎడమ గట్టు రాళ్లవలన అవుట్‌ఫాల్ స్లూయిస్ ఆధునికీకరణకు రూ.13.40 కోట్లు నిధులు మంజూరైనట్టు సంబంధిత అధికారులు తెలిపారు. టెండర్లు ప్రక్రియ పూర్తి చేసుకుని ఎగ్రిమెంట్ అనంతరం పనులు ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు.



రారండోయ్ వేడుక చూద్దాం..

నేడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహుని దివ్య కల్యాణ మహోత్సవం

రాత్రి 12.55కు ముహూర్తం

6

సమాజ హితం... సందేశాత్మకం

● తాటిపర్తిలో మొదలైన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు



చిగురు మేఘం నాటికలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న పరిణామాలను వివరిస్తూ సందేశాత్మకంగా సాగాయి నాటికలు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో తొలిరోజు ప్రదర్శించిన నాటికలు ఆలోచింపజేశాయి. వైద్య రంగంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు 'చిగురు మేఘం' నాటిక ద్వారా కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఒక కొడుకు భార్యను సైతం వదిలి సొంతూరు వెళ్లిపోవడానికి సిద్ధపడ తాడు. సరైన వైద్యసేవలు అందక తల్లి చనిపోయింద్న విషయం అతనిలో ఈ మార్పు తీసుకొస్తుంది. డబ్బు సంపాదనే ధ్యేయంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, వైద్యులు వ్యవహరిస్తున్న తీరుని ఎండగడుతూనే గ్రామాలకు వైద్యులు తరలిరావడం ద్వారా అందరికీ సకాలంలో వైద్యసేవలు అందుతాయనే సందేశాన్ని ఇచ్చింది. ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచించగా ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, అమలులో ఉన్న చట్టాలు దుర్వినియోగమవుతున్న తీరును విశాఖపట్టణం తెలుగు కళాసమితి కళాకారులు ప్రదర్శించిన 'నిశ్శబ్దం నీ ఖరీదెంత' నాటిక ద్వారా వివరించారు. సమాజంలో వివాహేతర సంబంధాలు వివాహ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న తీరు, ఆ మాటున కొందరు చేస్తున్న చర్యలు అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్న విధానాన్ని తెలియజేశారు. వీటీ మాధవ్ రచించిన ఈ నాటికకు చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వం వహించారు.

గిరిజనులకు పథకాలు వర్తింపజేయాలి

● టీఎస్ఎఫ్ నాయకుల డిమాండ్ ● 'నన్నయ'లో ముగిసిన గిరిజనోత్సవాలు



వేదికపై నుంచి అభివాదం చేస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గిరిజన కుటుంబానికి వర్తింపచేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్పనాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్రప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణు నాయక్ కోరారు. టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు.

కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయక్, మహిళా అధ్యక్షురాలు మధులత, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, రాష్ట్ర నాయకులు హేమలత, రామరాజు, వెంకటేశ్వర్లు నాయక్, రఘునాథ్, రాజశేఖర్, వెంకటేష్, సుమిత్, వినోద్, లోక్యానాయక్, ప్రిన్సిపాల్ పి. విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ధవళగిరిపై .. లక్ష్మీ జనార్దనుడు!

● రేపటి నుంచి కల్యాణోత్సవాలు ఆరంభం



రథానికి రంగులు వేస్తున్న దృశ్యం



ఆలయంలో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

● ముందుగా 40 అడుగుల రథంపై ఊరేగింపు
● 13న పుష్పోత్సవంతో ముగింపు
● ఒక పక్క ఆధ్యాత్మికత.. మరో పక్క ఆహ్లాదం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం.. రాజమహేంద్రవరం వెళుతుంటే మధ్యలో కనిపించే చిన్నగ్రామం.. ఆ గ్రామంలో గోదావరి చెంతనే ఉంది ఒక కొండ.. ఆ కొండపై స్వయంభూగా వెలసిన దేవుడే శ్రీ భూనీళా సమేత లక్ష్మీజనార్దన స్వామి. ఆ కొండపైకి వెళితే అంతా ఆహ్లాదమే .. గోదావరి చూస్తూ.. స్వామిని దర్శనం చేసుకుంటే అంతా మనశ్శాంతి .. చాలా మందికి ఈ స్వామి గురించి అంతగా అవగాహన ఉండదు. ఒకసారి వెళ్లి దర్శించుకుంటే మళ్లీ మళ్లీ దర్శించుకోవాలనిపించేలా స్వామి ప్రతిరూపం ఉంటుంది. ఇదే కొండపై ఆంజనేయస్వామి ఆలయంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రుడి పాదముద్రలు ఉన్నాయి. ఈ నెల 8వ తేదీ నుంచి ధవళగిరి లక్ష్మీ జనార్దన స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం రథోత్సవంతో మొదలయ్యే ఉత్సవాలు గురువారం పుష్పోత్సవంతో ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు. మెట్ల మార్గాన్ని రంగులతో, విద్యుద్దీపాలతో తీర్చిదిద్దుతున్నారు. దిగువన రామపాదాల ఘాట్ వరకు తాటాకు పందిళ్లు వేసి మామిడి తోరణాలతో అలంకరిస్తున్నారు. ఈ నెల 3న స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. 4న స్వామి వారి రథానికి పూజలు నిర్వహించి రథం అలంకారాన్ని ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి స్వామి వారి దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు.

● రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ

అందంగా ముస్తాబైన భారీ రథంపై స్వామి అమ్మవార్లు ఆశీనులై గ్రామంలో ఊరేగుతూ భక్తుల అభయమిస్తూ సాగే రథోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఉన్న రహదారి గుండా రథం ముందుకు సాగుతుంది. కిక్కిరిసిన భక్తజనం జయజయ ధ్వానాల మధ్య ఇరుకు మార్గంలో వందలాది మంది భక్తులు రథానికి రెండు వైపులా కట్టిన తాళ్లను భక్తి పారవశ్యంతో లాగుతుండగా రథం వయ్యారంగా కదులుతూ ముందుకు సాగడాన్ని కనులారా వీక్షించాల్సిందే. రథంపై ఆశీనులైన స్వామి అమ్మవార్లకు అర్పిస్తున్నట్లుగా భక్తులు అరటిపండ్లను రథం వైపు విసురుతూ తన్మయత్వం పొందుతారు. అన్ని ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణం అనంతరం రథంపై ఊరేగిస్తుండగా ఇక్కడ రథోత్సవం తర్వాతి రాత్రి కల్యాణోత్సవాన్ని జరుపుకోవడం ప్రత్యేకం. అంతర్వేది కల్యాణోత్సవం తరువాత ధవళేశ్వరం జనార్దనుడి ఉత్సవాలు ఆరంభమవుతాయి.. తరువాత కోరుకొండ నరసింహ స్వామి కల్యాణోత్సవాలు ఆరంభమవుతాయి.

● తొలి తాంబూలం మత్స్యకారులకే

ఉత్సవాల్లో భాగంగా రథాన్ని ముందుకు నడిపించేది.. కదిలించేది మత్స్యకారులే. ముందస్తుగా మత్స్యకార పెద్దలను సత్కరిస్తారు. మత్స్య కారులకు తొలి తాంబూలం ఇచ్చిన తరువాతనే రథోత్సవం ఆరంభిస్తారు. ఇది అనాధిగా వస్తున్న ఆచారం. నేటికీ అదే ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో రథాన్ని మత్స్యకారులే లాగే వారు. ఇప్పుడు సాధారణ భక్తజనం కూడా లాగుతున్నారు..

● అతి ఎత్తయిన రథం

ఆరు అంతస్తులతో 40 అడుగుల ఎత్తు, 25 అడుగుల వెడల్పు ఉన్న ఈ రథం తెలుగు రాష్ట్రాల్లో అతి ఎత్తయిన రథంగా చెబుతారు. వందల టన్నుల బరువు ఉన్న ఈ రథానికి ఉంచిన ఆరు భారీ చక్రాలను అదుపు చేయడం ద్వారా రథ గమనాన్ని నియంత్రిస్తూ ఉంటారు. రథం దిగువున మధ్య భాగంలో అమర్చిన కప్పి వంటి నిర్మాణంతో భారీ రథాన్ని గాలిలోకి లేచే విధంగా చేసి కావాల్సిన వైపునకు సులభంగా తిప్పుతారు.

● ఉత్సవాల నిర్వహణ

ఈ నెల 8న ఏకాదశి రోజున స్వామి వారికి విశేష అర్చనలు, భక్తులకు దర్శనం. రథ సంప్రోక్షణ, కుంభ నివేదన, రథోత్సవం, ధ్వజారోహణ, అంకురార్పన, రాత్రి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. 9న గరుడ వాహన సేవ, 10న సింహవాహన సేవ, సదస్యం. 11న అశ్వావాహన సేవ, చోర సంవాదం, 12న పూర్ణాహుతి, చక్రస్నానం. చూర్ణోత్సవం, వసంతోత్సవం, ముత్యాల పల్లకీసేవ, 13న ద్వాదశ అర్చనలు, ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పోత్సవాలతో ఉత్సవాలు ముగిస్తాయి

● ప్రత్యేక బందోబస్తు

శనివారం ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులను నియంత్రించడంతో పాటు మధ్యాహ్నం మూడు గంటకు మొదలయ్యే రథోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు దక్షిణ మండలి డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. శని, ఆదివారాల్లో సెలవు దినాలు కావడంతో భక్తుల రద్దీ దృష్ట్యా ధవళేశ్వరం సీఐ టి.గణేష్‌తో పాటు కడియం, రాజమహేంద్రవరం సీఐలు, ఎస్ఐలు, సుమారు 50 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించనున్నట్టు తెలిపారు.



రథోత్సవం (ఫైల్)



కొండకు వెళ్లే మెట్ల మార్గం

రారండోయ్.. వేడుక చూద్దాం

● నేడు అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దివ్య కల్యాణం ● అర్ధరాత్రి 12:55 గంటలకు ముహూర్తం

అంతర్వేది, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బుగ్గన చుక్కతో సిగ్గులు ఒలకపోస్తూ రథసప్తమి నాడు పెండ్లి కుమారుడిగా దర్శనమిచ్చిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు శుక్రవారం రాత్రి ఉభయ దేవేరులను పరిణయమాడేందుకు సిద్ధమయ్యారు. పంచభూతాల సాక్షిగా అఖండ జన సందోహం నడుమ ప్రతిఏటా మాఘమాసంలో కనుల పండువగా జరిగే శ్రీనారసింహుడి కల్యాణం చూసేందుకు రెండు కళ్లు చాలవు. కోరికలు తీర్చే శ్రీనారసింహుని పరిణయ ఉత్సవాలు పది రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో కీలకఘట్టమైన కల్యాణోత్సవం శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.55 గంటలకు (తెల్లవారితే శనివారం) జరుగుతుంది. అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ దీపాల అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామివారి ఆలయం

● వైభవంగా గ్రామోత్సవాలు

కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి లక్ష్మీ సూర్యనారాయణరాజు వారిచే నిర్మించిన హంస వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చక అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ధూపసేవ అనంతరం వైభవంగా ధ్వజారోహణ నిర్వహించారు.సకల దేవతలను ఆహ్వానించడానికి ధ్వజస్తంభం వద్ద అర్చక స్వాముల నేతృత్వంలో ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. గరుత్మంతుడు చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై అర్చకులు ఎగురవేశారు. రాత్రి ఎనిమిది గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు గన్నాబత్తుల వెంకట రాజారావు, లక్ష్మీనరసింహస్వామి వారిచే నిర్మితమైన శేష వాహనంపై గ్రామోత్సవం జరిపారు. స్వామివారికి భక్తులు హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజాబహదూర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లి బాబు, వలవల రాంబాబు, మందపాటి వెంకటేశ్వర్లు, వనమాలి మూలాస్వామి, దాసరి వాసు, ఆకన బాబ్జినాయుడు, కొండా కిశోర్, బర్రే శ్రీను, ఉత్సవసేవా కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



● కల్యాణోత్సవాల్లో భాగంగా నేడు..

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 4.30 గంటల నుంచి 5 గంటల వరకు సుప్రభాత సేవ, ఏడుగంటలకు ఆర్జిత అభిషేకం, అనంతరం సాధారణ ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం నాలుగు గంటలకు పంచముఖ ఆంజనేయ స్వామి వాహనం, రాత్రి 8.30 గంటలకు కంచుగరుడ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

● సర్వం సిద్ధం : ఎస్పీ కృష్ణారావు

స్వామివారి దివ్య కల్యాణోత్సవాల సందర్భంగా బందోబస్తు పరంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ బీ. కృష్ణారావు తెలిపారు. స్వామివారి కల్యాణ మండపం వద్ద గురువారం బందోబస్తుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ కల్యాణం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు.. 1600 మంది పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణకు స్వామివారి తిరునాళ్ల కోసం కేటాయించామన్నారు. తొమ్మిది విభాగాలుగా కేటాయిస్తూ ఒక ఎస్పీ, ఒక ఏఎస్పీ 10 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు ముఖ్య ఘట్టాల వద్ద విధులు నిర్వహిస్తారు. వన్‌వే రూట్‌ను ప్రతీఒక్కరూ ఫాలో అయ్యేలా పూర్తిస్థాయి భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. అంతర్వేది పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఆలయ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. 20 డ్రోన్ కెమెరాల పర్యవేక్షణతో పాటు వంద సీసీ కెమెరాలు తీర్థ మహోత్సవాల్లో ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూములో పర్యవేక్షిస్తున్నామన్నారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులు సూచిక బోర్డులు ఫాలో అవుతూ కల్యాణ టికెట్ తీసుకుని వారికి కేటాయించిన బ్లాక్‌లో కూర్చొని స్వామివారి కల్యాణాన్ని తిలకించాలన్నారు. కల్యాణోత్సవం, వాహన సేవలు, రథోత్సవంలో బారికేడ్లు ఏర్పాటు చేసి ఎటువంటి తొక్కిసలాట జరగకుండా పూర్తిస్థాయి భద్రతా చర్యలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్డీఆర్ఎఫ్, స్పెషల్ పార్టీ, మెరైన్ పార్టీలో తీర్థ మహోత్సవాలతో పాటు బీచ్, స్నాన ఘట్టాల వద్ద బందోబస్తు సిద్ధం చేశామని తెలిపారు. తీర్థ మహోత్సవాలకు వచ్చే భక్తులు ఒరిజినల్ పాస్‌లు మాత్రమే చూపించాలని, డూప్లికేట్ పాస్‌లు చూపించినా, వాడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లవరం నుంచి స్వామివారి గజమాల యాత్రగా అంతర్వేది ఆలయానికి వచ్చే భక్తులకు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్, రాజోలు సీఐ నరేష్ కుమార్, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన స్వామివారి కల్యాణ మండప ప్రధాన రహదారి



ఉత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు

తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలురు, బాలికల జట్టు

రామచంద్రపురం (ద్రాక్షారామ),ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 8 నుంచి 11 వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ బాలబాలికల చాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. గురువారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. బాలురు, బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, రామచంద్రాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర మరువలేనిది

● ఇన్‌చార్జి ఉప కులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ



జేఎన్టీయూకే వీసీ మురళీకృష్ణతో విశ్రాంత ఉద్యోగులు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర మరువలేనిదని ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్రాంత అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని వీసీ సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు డాక్టర్ పి.విజయ కుమార్ అధ్యక్షత వహించగా సంయుక్త కార్యదర్శి పి.రామారావు, గంగాధర శాస్త్రి, రఘురాం, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్స్‌కి లాన్ టెన్నిస్ పోటీలు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్, ఐటా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలిండియా అండర్-16 లాన్ టెన్నిస్ పోటీలు గురువారం సెమీఫైనల్స్ దశకు చేరుకున్నాయి. బాలుర విభాగంలో ధ్రువ్ (తమిళనాడు)పై భువన్ (ఏపీ) 6-0 6-1, విన్సెంట్ (ఏపీ)పై తనీష్ (తెలంగాణ) 6-2 6-3 స్కోర్లతో గెలుపొందారు. బాలికల విభాగంలో గౌరిశ్రీ (తెలంగాణ)పై జోషిత (ఏపీ) 6-4, 5-7, 6-4, జోహ (తెలంగాణ)పై సవర్ణిక (తెలంగాణ) 6-3, 6-4 స్కోర్లతో విజయం సాధించారు.

పోటీలను లాన్ టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి వీవీ రామ్‌కుమార్, చీఫ్ రిఫరీ శివ కుమార్ పర్యవేక్షించారు.

అదుపు తప్పిన మోటారుసైకిల్

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



గోకవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలోని కొత్తపల్లి రోడ్డులో గురువారం ఓ మోటారుసైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని బెండపూడికి చెందిన గోసాల సతీష్(17) తన స్నేహితులతో కలిసి గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి నాలుగురోజుల కిందట వచ్చాడు. ఈ నేపథ్యంలో గురువారం స్నేహితులతో కలిసి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. కొత్తపల్లినుంచి జగ్గంపేట వెళ్లే రోడ్డులో ఆదర్శకళాశాల దాటిన తర్వాత మలుపులో మోటార్‌సైకిల్ అదుపుతప్పి ప్రమాదవశాత్తూ రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సతీష్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మరణించగా తోటి స్నేహితుడు స్వల్పగాయాలయ్యాయి. సతీష్ మృతిపట్ల స్థానికులు, బంధువులు విలపించారు. గోకవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండ దిగుతారు!



కూనవరంలో కొండలపై కొండరెడ్ల ఇళ్లు

- కూనవరంలో కొండరెడ్లకు పీఎం జన్‌మాన్ కింద ఇళ్లస్థలాల మంజూరు
- కొండలపై నుంచి కిందకు దిగనున్న 9 గ్రామాల్లోని 136 కుటుంబాలు
- స్థలం కోసం అటవీశాఖకు ప్రతిపాదనలు పంపిన గృహనిర్మాణశాఖ

కూనవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంలో నివసిస్తున్న కొండరెడ్లు ఇక బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టనున్నారు. విద్య, వైద్యం ఇప్పటికీ వారికి అందని ద్రాక్షే. ఒకవైపు టెక్నాలజీ శరవేగంగా అభివృద్ధి జరుగుతున్నా, మరో వైపు కొండరెడ్ల జీవన వ్యవస్థ మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడి లాగే ఉంది.

అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలోని కూటూరు గుట్టపై 9కొండరెడ్ల గ్రామాల్లో ప్రజలు నివాసముంటున్నారు. వీరిని కొండలపైనుంచి కిందకి దింపాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ కంకణం కట్టారు. ఇప్పటికే ఆయన ఢిల్లీలోని సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి పీఎం జన్‌మాన్ పథకం కింద ఇళ్లు సైతం మంజూరు చేశారు. దీంతో కొండరెడ్లు గ్రామాలైన కలింగమెద్దికి చెందిన పది కుటుంబాలకు కోపిరిమెట్టలో 19 కుటుంబాలకు, ఎలుగులగొందిలో 7 కుటుంబాలకు, తోటమామిడిగొందిలో 15 కుటుంబాలకు, పుసులుమామిడిగొందిలో 6 కుటుంబాలకు, చింతగండిలో 15 కుటుంబాలకు, కొత్తకారుమానుకోట 23 కుటుంబాలకు, గబ్బిలాలగొంది 21 కుటుంబాలకు, పాతకారుమానుకోట 20 కుటుంబాలకు మొత్తం 136 కుటుంబాలకు ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్ల కోసం నిర్మాణం కోసం రెండెకరాల భూమి కేటాయించాలని హౌసింగ్‌శాఖ, అటవీశాఖ అనుమతికోసం ప్రతిపాదనలు పంపింది. దీంతో కూనవరం-చింతూరు ప్రధాన రోడ్డు మార్గంలోని కూటూరు బస్టాండ్ దగ్గర స్థలం పరిశీలించారు. వచ్చేఏడాది 2026 నాటికి ఈ ఇళ్ల పూర్తి చేయనున్నారు. కొండరెడ్లకు అన్ని వసతులు కల్పించి వారిని మైదాన ప్రాంతంలోని జనజీవనంలో జీవించేలా బాహ్య ప్రపంచానికి పరిచయం చేయనున్నారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

కూటూరు గట్టుపై ఉంటున్న కొండరెడ్ల కోసం ఇళ్లు నిర్మించేందుకు భూమి కేటాయించాలని హౌసింగ్‌శాఖనుంచి అనుమతికోసం ప్రతిపాదనలు వచ్చినట్టు కూనవరం అటవీశాఖాధికారి కరుణాకరన్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. దీనికి నివేదిక తయారుచేసి అటవీశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతానని తెలిపారు. ప్రతిపాదనలు మంజూరుకాగానే స్థలం కేటాయిస్తామన్నారు.

కోళ్ల ఫారాల్లో..

వైరస్ భయం



గండేపల్లి మండలం కె.గోపాలపురంలో ఫారంలో ఉన్న బ్రాయిలర్ కోళ్లు

- ఉమ్మడి జిల్లాల్లో కొత్త వైరస్ ఆందోళన
- పక్క జిల్లాలో కోళ్లు చనిపోవడంతో వణుకు
- బెంబేలెత్తిపోతున్న కోళ్లఫారాల నిర్వాహకులు

గండేపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎండాకాలం వస్తోందంటేనే బ్రాయిలర్ ఫారాల నిర్వాహకుల గుండెల్లో దడపుడుతోంది. కంటికి రెప్పగా కాపాడుకునే కోళ్లు ఎండల తీవ్రత, వడగాల్పులకు పిట్టల్లా రాలిపోతుంటాయి. రెండేళ్లుగా ఎండాకాలంలో ఫారం నిర్వాహకులు నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ సంవత్సరం వేసవి భయంతోపాటు వైరస్ భయం కూడా ఫారం నిర్వాహకులను బెంబేలెత్తిస్తోంది. పక్క జిల్లాల్లో వైరస్ తెగులుతో బ్రాయిలర్ కోళ్లు పిట్టల్లా రాలిపోతుండగా మన ఉమ్మడి జిల్లాలో కూడా పలుచోట్ల కోళ్లు చనిపోతున్నాయి. వైరస్ విజృంభిస్తే పరిస్థితి ఏంటని రైతుల్లో ఆందోళన నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో కోళ్లఫారాలు

ఫారాల్లో బ్రాయిలర్ కోళను పిల్ల దగ్గర నుంచి 45 - 55రోజుల వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తుంటారు. ఎటువంటి తెగులు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు వాటికి కావాల్సిన సౌకర్యాలు అందిస్తుంటారు. ఎండాకాలంలో మజ్జిగ, బీట్‌రూట్ జ్యూస్ సైతం కోళ్లకు పెడుతుంటారు. షెడ్లపై చల్లదనానికి ఆకులు వేసి నీటితో తడుపుతూ జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ, ఇప్పుడు వ్యాపిస్తున్న వైరస్ మహమ్మారి సోకకుండా పరిరక్షించేందుకు పలు కంపెనీలు ముందుగానే చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని అనపర్తి, రంగంపేట, సామర్లకోట, జగ్గంపేట, రాజానగరం, మండపేట, రాయవరం తదితర ప్రాంతాల్లో కోళ్ల ఫారల్లో లక్షల సంఖ్యలో కోళ్ల పెంపకం జరుగుతోంది. గండేపల్లి మండలంలో కె.గోపాలపురం, ఎన్టీరాజాపురం, తాళ్లూరు, గోపాలపురం, సుబ్బయ్యమ్మపేట పలు ప్రాంతాల్లో 2లక్షలకు పైగా కోళ్ల పెంపకం జరుగుతోంది. ప్రస్తుతం వైరస్ భయంతో ఫారాల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

వైరస్ సోకకుండా చర్యలు తీసుకోవాలి

-యరమళ్ల విష్ణు, ఫారం నిర్వాహకుడు

కోళ్లకు వైరస్ సోకుండానే కంపెనీలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే కోళ్ల ఫారాల్లో లాభాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వేసవి భయంతో పాటు వైరస్ భయం కూడా భయపెడుతోంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

హేచరీలో కేసినో తరహాలో పేకాట



అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో ఇటీవల ఓ వైసీపీ నేత హేచరీ వద్ద కేసినో తరహాలో కోడిపందేలు, పేకాటలు

- కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో విందు, వినోదంతో చిందులు
- వైరల్ అయిన వీడియోలు.. స్పందించిన పోలీసులు
- కేసు నమోదు చేశామని అల్లవరం ఎస్ఐ ప్రకటన

అమలాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పోలీసు యంత్రాంగం ఉదాసీనంగా ఉండడంతో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయి. కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో వైసీపీ నేతకు చెందిన ఓ హేచరీలో ఇటీవల ఓ పార్టీ జరిగింది. విందు, వినోదాలతోపాటు కేసినో తరహాలో భారీ జూద క్రీడ నిర్వహించారు. కాయిన్లతో ఈ ఆటను నిర్వహించడం దానికి కోనసీమలోని కీలక నాయకులు హాజరైనప్పటికీ పోలీసులు ఆ వ్యవహారాన్ని చూసీచూడనట్టు వదిలేయడం గమనార్హం. అక్కడ జరిగిన విందుతోపాటు కేసినో తరహా జూద క్రీడకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో గురువారం వైరల్ అయ్యాయి. దీంతో పోలీసు అధికారులు స్పందించారు. అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్టు అల్లవరం ఎస్ఐ హరీష్ ఒక ప్రకటన చేశారు. పక్కా వ్యూహంతో ఆ హేచరీ వద్ద తరచూ ఈ తరహాలో పేకాట, కోడిపందేలు కేసినో తరహా ఆటలు వంటివి జరుగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన జూద క్రీడతోపాటు రాత్రివేళల్లో కోడిపందేలు కూడా నిర్వహించి భారీగా సొమ్ములు కాసినట్టు తెలిసింది. వీడియోలు వైరల్ అవ్వడంతో పోలీసులు విధిలేని పరిస్థితిలో వారిపై కేసులు పెడుతున్నామని వెల్లడించారు. ఈ జూద క్రీడలో పాల్గొనేందుకు కూటమికి చెందిన స్థానికేతర ఎమ్మెల్యే ఒకరు ముఖ్యఅతిథిగా హాజరై ఈ వినోదాలను తిలకించారని సమాచారం. అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో హేచరీవద్ద ఘటనలో బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసినట్టు అల్లవరం ఎస్ఐ హరీష్ తెలిపారు. వీటిని నిర్వహించడానికి కారకులైన హేచరీ యజమానిపైన కేసు నమోదు చేశామన్నారు. వీడియోల ఆధారంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు. అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న ఓ స్థావరంపై పోలీసులు దాడిచేసి 9 మందిని అరెస్టుచేసి వారి నుంచి రూ.77వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. అమలాపురంతో ఇతర ప్రాంతాల్లో కూడా అనధికారికంగా పేకాట క్లబ్‌లు రహస్య స్థావరాల్లో నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

బర్డ్‌ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

కాకినాడ జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు

కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి: బర్డ్‌ఫ్లూ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఇది ఎక్కువగా కోళ్లు, బాతులు, టర్కీలపై ప్రభావం చూపతుందన్నారు. ఈ వ్యాధితో మృతి చెందిన కోళ్లను ముట్టుకోవడం, ఆ మాంసం తినడం ద్వారా మానవులకు సోకే అవకాశం ఉందన్నారు. అధిక ఉష్ణోగ్రతలో ఉడికించిన మాంసాన్ని మాత్రమే తినాలన్నారు. పెద్ద మొత్తంలో కోళ్లు మృతిచెందితే తమకుఫిర్యాదు చేయాలన్నారు.

లక్ష్యాన్ని అధిగమించే దిశగా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం



పొల్లూరు జల విద్యుత్ కేంద్రం

మోతుగూడెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్‌లోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో లక్ష్యాన్ని అధిగమించేదిశగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని ప్రాజెక్టు డీఈ భీమవరపు బాలకృష్ణ తెలిపారు. సీలేరు నది పరివాహక ప్రాంతంలో ఈఏడాది అత్యధికంగా వర్షాలు కురవడం కలిసి వచ్చిందన్నారు. 2024-25 మార్చికి పొల్లూరు ఉత్పత్తి లక్ష్యం 1084మిలియన్ యూనిట్లు కాగా, ఫిబ్రవరి నాలుగు నాటికి 1020.4మిలియన్ యూనిట్ల ఉత్పాదన జరిగిందని తెలిపారు. ఈ కేంద్రంలో నిత్యం 3.7మిలియన్ యూనిట్లనుంచి 4మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పతి జరుగుతోందని, దీని ప్రకారం ఫిబ్రవరి 25వతేదీ నాటికి లక్ష్యాన్ని అధిగమించి రికార్డు నెలకొల్పే అవకాశాలున్నాయన్నారు. మార్చి నెలాఖరుకు ఈ కేంద్రం నుంచి 100 మిలియన్ యూనిట్లు అదనపు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని అంచనా వేస్తున్నామన్నారు. సీలేరు కాంప్లెక్స్‌లోని జలాశయాల్లో 50టీఎంసీల వరకు నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో రానున్న వేసవిలో సైతం విద్యుత్ ఉత్పత్తికి ఢోకా ఉండబోదని భావిస్తున్నామని తెలిపారు.

రుణాలు తీరకుండానే డ్వాక్రా గ్రూపు ఖాతాల్లో నగదు జమ



రాజవొమ్మంగి మండలం దూసరపాములో విచారణ చేపడుతున్న వెలుగు సీసీలు

- ఆశ్చర్యానికి గురైన డ్వాక్రా సంఘాల సభ్యులు
- విచారణ చేసిన వెలుగు సీసీలు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బ్యాంకు నుంచి తీసుకున్న డ్వాక్రా రుణాలు ఇంకా తీరకుండా బ్యాంకు అధికారులు రెండు డ్వాక్రా గ్రూపుల్లోకి నగదు జమ చేశారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం దూసరపాము పంచాయతీలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అరుణ, స్రవంతి గ్రూపులకు రుణం తీరకుండా మళ్లీ వారి గ్రూపు ఖాతాల్లో నగదు జమకావడంపై గ్రూపు సభ్యులు ఒకింత ఆశ్చర్యం, ఆందోళన వ్యక్తం చేశారు. తాము అడగకుండానే నిధులు ఖాతాలో జమ కావడంపై పలు అనుమానాలతో ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం ఐదుగురు వెలుగు సీసీలు గ్రామానికి విచ్చేసి డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశమై పరిస్థితి అడిగి తెలుసుకుని విచారణ చేపట్టారు. తమ తీర్మానం లేకుండా తమ గ్రూపు ఖాతాల్లోకి నగదు ఎలా జమైందని అధికారులను ప్రశ్నించారు. రెండు గ్రూపులకు సంబంధించి రూ.40లక్షలు ఖాతాల్లో జమయ్యాయని, దీనికి సంబంధించి వివరాలు వెలుగు అధికారులకు ఇవ్వకుండా నేరుగా బ్యాంకు అధికారుల నేతృత్వంలో జమ చేసినట్లు ఆరోపణలు చేస్తున్నారు. సీసీ మీడియాతో మాట్లాడుతూ సాధారణంగా సంఘ సభ్యుల తీర్మానంతోనే డ్వాక్రా రుణాలు విడుదల చేస్తారని, ప్రస్తుతం ఈ ఘటనలో సంఘ సభ్యులు తెలిపిన ప్రకారం నివేదిక ఏపీఎంకు అందజేస్తామని అన్నారు. ఎక్కడ తప్పిదం జరిగిందో ఉన్నతాధికారుల విచారణలో తేలుతుందన్నారు. దీనిపై పూర్తి వివరణ బ్యాంకు మేనేజర్ దగ్గర తీసుకోవాలన్నారు.

14మంది కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత



కేజీబీవీ పాఠశాలలో విచారణ చేస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

వై.రామవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం తోటకూరపాలెం కస్తూర్బా విద్యాలయంలోని 14మంది విద్యార్థినులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. వారిని చవిటిదిబ్బలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్సులో తరలించారు. జీర్ణావస్థ ప్రక్రియకు గురికావడంతో వారిలో 8మందికి వాంతులు, ఐదుగురికి లూజ్‌మోషన్లు, గొంతునొప్పి, ఒకరికి కడుపునొప్పి ఉన్నాయని వారికి చికిత్స అందించి స్కూల్‌కు పంపించామని వైద్యాధికారులు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ దినేష్ తెలిపారు. దీనిపై పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీని వివరణ కోరగా పాఠశాలలో ఉదయం ఒక విద్యార్థినికి గ్రీన్ కలర్‌లో వాంతు కావడంతో ఆస్పత్రికి పంపించామన్నారు. మిగిలిన విద్యార్థినులను కూడా ఆసుపత్రికి పంపించి పరీక్షలు జరిపించామన్నారు. పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగినట్లు విస్తృత ప్రచారం జరగడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏజెన్సీ డీఈఓ మల్లేశ్వరరావు వెంటనే పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. ఆయన వెంట ఎంఈవో 2 వెంకటరమణ, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి ఉన్నారు.

ఆటో బోల్తాపడి మహిళకు గాయాలు

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఓ మహిళ చెవితెగిపడి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం రాత్రి కాకినాడలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ మెయిన్‌రోడ్డు నుంచి ఓ ఆటో ముగ్గురు ప్యాసింజర్లతో జగన్నాథపురంలోని జె.రామారావుపేటకు బయలుదేరింది. ఆటో బ్లూకాన్వెంట్ వద్దకు వెళ్లేసరికి ఆ మలుపులో ప్రమాదవశాత్తూ బోల్తాపడింది. ఈ నేపథ్యంలో జగన్నాథపురానికి చెందిన 50ఏళ్ల చింతా పార్వతి కుడి చెవి తెగి వేరు పడి తీవ్రంగా గాయాపడింది. ఆమెతోపాటు స్వల్ప గాయాలపాలైన మరో ఇద్దరు ప్యాసింజర్లను కూడా స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించారు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సెల్ చోరీ

- వెంటనే నిందితుడిని పట్టుకున్న ట్రాఫిక్ ఎస్ఐ

సామర్లకోట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఒక వ్యక్తిని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తన సిబ్బందితో కలిసి గురువారం మధ్యాహ్నం పట్టుకున్నారు. బస్సు ఎక్కేందుకు కాంప్లెక్స్‌కు చేరుకున్న ఒక మహిళ సెల్‌ఫోన్‌ను చోరీ చేసినట్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ట్రాఫిక్ ఎస్ఐ సత్వరం స్పందించి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తిని గుర్తించి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోనే అతని కదలికలపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన ప్రేమ్‌కుమార్‌గా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అతడిని సామర్లకోట పోలీస్‌స్టేషన్‌కు తదుపరి దర్యాప్తు నిమిత్తం తరలించారు.

చింతూరులో గుండెనొప్పి బాధితుడికి చికిత్స

ప్రభుత్వాస్పత్రిలో ఖరీదైన ఇంజక్షన్

చింతూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఏరియా ఆస్పత్రిలో గుండెనొప్పి బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టారు. అల్లూరి జిల్లా చింతూరు మండలం కొత్తపల్లికి చెందిన ఎస్కే చంటికి గురువారం గుండెనొప్పి వచ్చింది. దీంతో సమీపంలో తులసిపాకల ప్రాథమిక వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. అక్కడి వైద్యులు పరిస్థితిని అంచనా వేసి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు చంటికి గుండెపోటుగా నిర్ధారించారు. వెంటనే బాధితుడికి రూ.40వేల విలువైన టెనెక్టిప్లెస్ ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు నిలబెట్టారు. మెరుగైన చికిత్సకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైద్య సేవలు అందించిన వారిలో ఏరియా ఆస్పత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ సాయికిషోర్ పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



అన్నవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన పుణ్యమంతుల సత్యనారాయణ దంపతులు రూ.1,11,600 విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

అనుమతులు లేకుండా ఆలయ నిర్మాణం



అనపర్తి శివారు కొత్తూరు కాలనీలో నిర్మాణంవద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

- నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి విగ్రహ ప్రతిష్ఠను అడ్డుకున్న అధికారులు
- అనపర్తి మండలం కొత్తూరులో 144 సెక్షన్, భారీ పోలీసు బందోబస్తు

అనపర్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అనపర్తి శివారు కొత్తూరుకాలనీలో అనుమతులు లేకుండా వైసీపీనాయకులు నిర్మాణంచేసిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వివాదాస్పదంగా మారింది. కొత్తూరుకు చెందిన వైసీపీ నాయకులు ఆలయాన్ని నిర్మించి 7న విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమమని కరపత్రాలు పంపిణీ చేశారు. దీంతో పంచాయతీ అధికారులు ఆలయ నిర్మాణం చేపట్టిన స్థలంపై ఆరా తీశారు. ఆ స్థలం కాలనీకి చెందిన ప్రభుత్వ భూమిఅని గుర్తించి ఆలయ నిర్మాణానికి అనుమతులు చూపాలని ఆలయ కమిటీని కోరారు. దీంతో వారు అనుమతులు లేవని చెప్పడంతో నిర్వాహకులకు నోటీసులు జారీచేశారు. అనుమతులు పొందిన తర్వాత మాత్రమే మిగిలిన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు.ఈ వివాదంపై సోషల్ మీడియాలో అనేక కథనాలు రావడం ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టులు రావడంతో అధికారులు స్పందించి ముందస్తు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించరాదని బ్యానర్లు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఎస్ఐ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ఏ కార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు. ఏఎస్పీ సుబ్బారావు మీడియాతో మాట్లాడారు. నిర్వాహకులతో సమావేశం నిర్వహించి అనుమతులు లేకుండా కార్యక్రమాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశామన్నారు. కొత్తూరు కాలనీల్లో 144సెక్షన్ విధించి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.

చెత్త ఆటో ఢీకొనడంతో వాహనకారులకు గాయాలు

అంతర్వేది, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు రాత్రి శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తుండగా రెవెన్యూ గెస్ట్ హౌస్ పరిధిలో అటుగా చెత్త తరలిస్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొనడంతో నలుగురు వాహనకారులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సాయంతో క్షతగాత్రులను మలికిపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దేవస్థానానికి సంబంధించిన చెత్తను తరలిస్తుండగా రాత్రి సమయంలో ఈ సంఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని, మిగిలిన వాహనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామోత్సవం సందర్భంగా ఈ ఘటన జరిగినప్పటికీ మిగిలిన వాహనకారులు శేషవాహనాన్ని గమ్యానికి చేర్చారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

ఐ.పోలవరం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): మురమళ్ళకు చెందిన చిక్కాల రాజేష్, అమలాపురానికి చెందిన మట్టపర్తి దుర్గాప్రసాద్‌లపై ఐ.పోలవరం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదుచేశారు. ముమ్మిడివరం స్పెషల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.రమాదేవి 15రోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్టు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

మోరి కాల్వ పనులు

మలికిపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మోరి కాల్వను రైతులకు సాగునీరు సక్రమంగా అందడానికి మరమ్మతులు చేస్తున్నట్టు మలికిపురం నీటి సంఘం అధ్యక్షుడు తిరుమల సుబ్బారావు తెలిపారు. కాల్వ పనులు రెండు రోజుల్లో పూర్తవుతాయని, శివారు ప్రాంతాలకు సక్రమంగా సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు.

కల్యాణ శోభతో అంతర్వేది దేవస్థానం కళకళ




పుష్పాలంకరణలో ప్రధాన గోపురం, పుష్పాలంకరణలో స్వామివారి దివ్య కల్యాణ పందిరి

అంతర్వేది, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న అంతర్వేది పుణ్యక్షేత్రం కల్యాణ శోభతో కళకళలాడుతోంది. ప్రధాన అంతరాలయం, క్యూలైన్లు, ధ్వజస్తంభం, ఆలయ గోపురం, కల్యాణ మండపాలను పచ్చి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంగణానికి ఆనుకుని నరసింహ అవతారం, అమ్మవారి గోపురం, సూర్యనారాయణమూర్తి, పాతాలభైరవి, అయోధ్య, వేంకటేశ్వరస్వామి, సాయిబాబా, శివుడు, నాలుగు ప్రాకార గోపురాలు, అంతరాలయ గోపురాలను విద్యుత్ అలంకరణ సెట్టింగులతో అంతర్వేది పుణ్యక్షేత్రం ఎల్‌ఈడీ స్వాగత గేటుతో ముస్తాబైంది. కల్యాణ మండప షెడ్లలో కల్యాణం తిలకించేందుకు బ్లాకులు ఏర్పాటు చేసి క్లాత్ సెటింగ్‌లు, పుష్పాలంకరణలో మండపం సిద్ధమవుతోంది. అలాగే కల్యాణ మహోత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.

కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

అంతర్వేది, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లు పూర్తి అయ్యాయని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా దిరిశాల బాలాజీ నేతృత్వంలో ఉత్సవ సేవాకమిటీ, కూటమి శ్రేణులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో ఉత్సవాల నిర్వహణలో నిమగ్నమయ్యారన్నారు. ప్రధానంగా శుక్రవారం రాత్రి జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ఆలయ పరిసరాలు, పారిశుధ్య పనులు, పరిశుభ్రతపై దృష్టి పెట్టామన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు ఏర్పాటుచేసి క్యూలైన్స్, బారికేడ్లు, రహదారుల నిర్మాణాలు శరవేగంగా జరిగాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ సేవా కమిటీ ఛైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, రాపాక రమేష్‌బాబు, గుబ్బల ఫణికుమార్, ఆకన బాబ్జీనాయుడు, ఉండపల్లి అంజి, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్వేదికి ప్రత్యేక బస్సులు

అమలాపురంరూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఈనెల7,8 తేదీల్లో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. 7వతేదీ రాత్రి స్వామివారి కల్యాణం, 8న రథోత్సవాన్ని పురస్కరించుకుని మూడు ప్రధాన రూట్లలో 46ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు. అమలాపురం, అంతర్వేది, అప్పనపల్లి-అంతర్వేది, పల్లం- అంతర్వేది రూట్లలో బస్సులు నడుపుతున్నామన్నారు.

అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్


అంబాజీపేటలో అంతర పంటల సాగును పరిశీలిస్తున్న కలెక్టర్

అంబాజీపేట, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): కొబ్బరితో పాటు ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారిస్తే అదనపు ఆదాయం సాధించవచ్చునని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంలో అభ్యుదయ రైతు, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు రైతు క్షేత్రంలో కోకో, అరటి తోటలతో పాటు కోకో సోలార్ డ్రైయింగ్ యూనిట్ పరిశ్రమను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొబ్బరి రైతులకు అంతర పంటల సేద్యం కల్పతరువుగా మారిందన్నారు. కోస్తా జిల్లాలో వాతావరణం కొబ్బరి సాగుకు అనుకూలమన్నారు. అందువల్లే కొబ్బరి తోటల విస్తీర్ణం కోనసీమ ప్రాంతంలో ఎక్కువగా ఉందన్నారు. కొబ్బరి తోటల్లో ఉండే పాక్షిక నీడ వల్ల చల్లని వాతావరణం ఏర్పడిందన్నారు. ఈవాతావరణం కోకో, సుగంధ ద్రవ్య పంటలకు ఎంతో అనువైందన్నారు. ఎక్కువగా కాలం ఉండే కొబ్బరి తోటల్లో అనేక సుగంధ ద్రవ్య పంటలను అంతర పంటలుగా సాగు చేస్తూ నేరుగా మార్కెటింగ్ చేసుకుంటూ ఆదాయం ఆర్జించాలన్నారు. అంతర పంటల సాగు వల్ల కొబ్బరి పంట ఉత్పత్తి పెరిగి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఆ దిశగా రైతులు అంతర పంటల సాగుపై ప్రత్యేక దృష్టిపెట్టి ఆదాయాన్ని పొందాలన్నారు. ప్రకృతి సేద్యంతో పాటు శాస్త్రీయ విధానాలను ఆచరించాలన్నారు. ఆధునిక సేద్యం పద్ధతితో పాటు సకాలంలో ఎరువులు, నీటియజమాన్యం పాటించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కొబ్బరి తోటలో కోకో, వక్క, మిరియాలు, పసుపు, అల్లం, పండిస్తూ సంతృప్తికరమైనఫలసాయాన్ని అర్జించాలన్నారు. కోకో సాగుతో ఎకరాకు ఎంత ఆదాయం లభిస్తుంది... ఎకరాకు పెట్టుబడి ఎంత ఖర్చు అవుతుందనే వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా డ్రైయర్ యూనిట్ స్థాపనకు పెట్టుబడి వ్యయాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి బీవీ రమణ, తహశీల్దారు జి.వెంకటేశ్వరి, ఉద్యానశాఖాధికారి శైలజ, రైతు నాయకులు ముత్యాల జమీలు, భాస్కరరావు, నిట్టాల సాయిరాం, ఎం.ఎం.శెట్టి, గిరిధర్ పాల్గొన్నారు.

విగ్రహాలకు విఘ్నేశ్వర పూజ, క్షీరాభిషేకం


విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న యాజమాన్య దంపతులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడిలోని శ్రీఉమావల్లభేశ్వరస్వామి శివాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గురువారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు జలాదివాస బింధోద్వాసన, విఘ్నేశ్వర పూజ, సోమ కుంభాబి ఆవాహన, మూలమంత్ర హోమాలు, క్షీరాభిషేకం, సాయంత్రం ధాన్యాదివాసం, ధాన్యాదివాసాది హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్యుల పర్యవేక్షణలో వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ 21మంది యాజమాన్య దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సామర్లకోటకు చెందిన భవయాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ వారితో భరతనాట్యం, కూచిపూడి వంటి పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో కె.కార్తీక, కౌన్సిలర్ మాదాల నాగసత్యమంగాకుమారి, మాదాల పరంకుశం, నయినాలశెట్టి శ్రీనివాసరావు, మాదాల శ్రీధర్, రామాయణం రాంబాబు, చింతలపూడి బాబూరావు, శిల్పి పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, పాయసం చిన్నీ పాల్గొన్నారు.

రెండు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులు సాధించిన కామేశ్వర్



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఈఏడాది విడుదల చేసిన విజేతల జాబితాలో అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన పుత్సా కృష్ణకామేశ్వర్ రెండు రికార్డులను సాధించారు. 2025 సంవత్సరం విడుదలచేసే పుస్తకంలో చోటు చేసుకునే రికార్డుల్లో అత్యధిక ముఖ విలువ కలిగిన కరెన్సీ నోట్ల సేకరణ ఒకటి. దీనిలో భాగంగా 91 దేశాలకు చెందిన 100నుంచి 100 క్వాడ్రిల్లియన్ (1 పక్కన 17 సున్నాలు) వరకు ముఖవిలువ కలిగిన 306 నోట్లు కృష్ణకామేశ్వర్ వద్ద ఉన్నాయి. రూ.5 ముఖ విలువ కలిగిన తపాలా బిల్లల విభాగంలో 360 తపాలా బిల్లలు సేకరించి రెండో రికార్డును సాధించారు. గతంలో కరెన్సీ నోట్ల సేకరణతో పాటు తపాలా బిల్లల సేకరణలో రెండు లిమ్కాబుక్ ఆఫ్ రికార్డులు సాధించారు. కృష్ణ కామేశ్వర్ కరోనా నాణేల సేకరణ (2023), తపాలా బిల్లల సేకరణ 2024లో రెండు రికార్డులు పొందిన విషయం తెలిసిందే. ఒక్కో విభాగంలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 4 లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులు సాధించిన తొలి తెలుగు వ్యక్తిగా కృష్ణకామేశ్వర్ నిలిచారు. ఈ సందర్భంగా కామేశ్వర్‌ను పలువురు అభినందించారు.

భయం లేకుండా పరీక్షలు రాయాలి

అల్లవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఇష్టపడి చదివి భయం లేకుండా శ్రద్ధగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. గురువారం అల్లవరం, కొమరగిరిపట్నం, ఓడలరేవు జిల్లా పరిషత్ హైస్కూళ్లను సందర్శించి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు కూడా బోధనా మెలకువలపై సూచనలు చేశారు. ఎంఈవో-1 కె.కిరణ్‌బాబు, మండల విద్యాశాఖాధికారి-2 ఎస్.ఏడుకొండలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

కాట్రేనికోన, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా గెద్దనపల్లి సర్పంచ్ దంతులూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో గురువారం గెద్దనపల్లి, బక్కవారిపేట, చింతలమెరక, పోరపేట, పొరగరువు, అడ్డపుంత, న్యూకాలనీల్లో ఎన్నికల ప్రచారం జరిగింది. పిన్నమరాజు రంగరాజు, విత్తనాల వెంకటరమణ, కముజు లక్ష్మీరమణారావు, గిడ్డి వెంకటరమణనాగరాజు, గోడి వెంకట్రావు, కొవ్వూరి ఏసురాజు, అల్లూరి సతీష్‌రాజు, పట్టా లక్ష్మణ్, కడలి వెంకటసత్యనారాయణ, సాపే రూప, కాశి జ్యోతిబాబు, పెన్మెత్స పుల్లంరాజు, కోరుమిల్లి రాంబాబు, చెల్లి నడవపల్లి, చింతా లోవరాజు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మవారి జాతరకు ఏర్పాట్లు

మామిడికుదురు, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి గ్రామదేవత కొండాలమ్మ అమ్మవారి జాతరను శుక్రవారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కనులు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో ఆలయాన్ని చూడముచ్చటగా ముస్తాబు చేశారు. అమ్మవారి జాతర పురస్కరించుకుని ఏడురోజులు ఆధ్యాత్మిక, సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

జాతీయ క్రీడలకు గుడిమెళ్లంక విద్యార్థిని



మలికిపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ కటిమ నియోజకవర్గంలో జరిగే 38వ జాతీయస్థాయి మల్లాకం క్రీడకు గుడిమెళ్లంక విద్యార్థిని కర్రి దేవి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు పీవీ సుబ్బారావు తెలిపారు. గత నెల భీమవరంలో జరిగిన నేషనల్ గేమ్స్ ఎంపికల్లో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ క్రీడలకు ఎంపికైనట్టు పీఈటీ వి.రాధాకృష్ణ తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని గురువారం ఎంఈవో ఎం.విజయశ్రీ అభినందించారు.

రాజోలు నియోజకవర్గంలో అత్యధిక ఓట్ పోల్ జరగాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా అత్యధిక ఓట్ పోల్ జరగాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండలం వీవీమెరక గ్రామంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక సమీక్షా సమావేశానికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతీ ఒక్కరినీ ఒకటికి రెండు సార్లు కలిసే విధంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలన్నారు. అత్యధిక ఓట్ పోల్ జరిగితే కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి రాజోలు నియోజకవర్గం కారణమవుతుందన్నారు. నెడ్‌క్యాప్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, మాలే శ్రీనివాసనగేష్, చాగంటి స్వామి, పోతురాజు సురేష్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి పరిశీలన

అయినవిల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శానపల్లిలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష ఏఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం గురువారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. పదో తరగతిలో ఎస్‌ఏ-1లో 537 మార్కులు సాధించిన ఎస్.వర్షితను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకృష్ణ, రమణారావు, డి.రామారావు, సత్యనారాయణ, రెడ్డి, బాల తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం తప్పదు: హర్షకుమార్


మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ప్రజలకు ఇస్తానన్న సూపర్-6 పథకాలు లేవు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి లేదు అంటూ విమర్శలు గుప్పించారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా విద్యావంతుడైన తన కుమారుడు జీవీ సుందర్ పోటీ చేస్తున్నారని ప్రకటించారు. నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నా సుందర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని ఆయన కోరారు. ఎన్నికల బరిలో నిలుస్తున్న సుందర్ మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశామని తెలిపారు. నాయకులు గెడ్డం సురేష్‌బాబు, గెద్దాడ బుద్ధరాజ్, పండు వీరవెంకటసత్యనారాయణ, సత్తి బాహూజీ, కత్తుల విక్టర్‌బాబు, జి.విజయ్‌కుమార్, బండి శ్రీరాములు, కాశి రామకృష్ణ, వడ్డి శ్యామ్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి

అయినవిల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి విజయానికి చేస్తున్న కృషిని పరిశీలకుడు, ఎమ్మెల్సీ దువ్వాడ రామారావు, పి.గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్ పరిశీలించారు. కార్యక్రమంలో మోకా ఆనంద్‌సాగర్, సయ్యపరాజు సత్తిబాబు రాజు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, నేదునూరి వీర్రాజు, మద్దా చంటిబాబు, కళ్లేపల్లి వెంకటసుబ్బరాజు, పెంద్ర రమేష్, కుడుపూడి బుజ్జి, అడపా నాగభూషణంతో పాటు ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి గవర్నర్‌తో ఎమ్మెల్యే గొల్లపల్లి భేటీ



యానాం, ఫిబ్రవ 6(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌తో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భేటీ అయ్యారు. పుదుచ్చేరిలలోని రాజ్‌నివాస్‌లో గవర్నర్‌ను మర్యదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తాను ప్రజాప్రతినిధిగా అయిన దగ్గర నుంచి యానాంలో ప్రజాపనుల శాఖలో ఉన్న సమస్యలను, అభివృద్ధి పనులను పదేపదే గుర్తుచేయవలసిన పరిస్థితి నెలకొందని గవర్నర్‌కు వివరించారు. ఇప్పటివరకు ఆ శాఖకు సం బంధించి సీఎస్ఆర్ నిధులు 108పనులకు నివేదికలు సమర్పించినా కానీ ఇంతవరకు ఎలాం టి కార్యాచరణ లేదన్నారు. ఇది అధికారుల తీరుకు నిదర్శనమని, దీనిపై తక్షణం స్పందించి ప్రజాపనుల శాఖ ద్వారా అభివృద్ధి పనులు జరిగేలా కోరామన్నారు. యానాంలో విద్యుత్ చార్జీలతో ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. సాంఘిక సంక్షేమశాఖ, ఆదిద్రావిడ సంక్షేమశాఖ, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, విద్యాశాఖ, మున్సిపాలిటీ తదితర శాఖలకు సంబంధించిన అంశాలను గవర్నర్‌కు వివరించారు. ఈసమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి కోరారు.

వైసీపీ జిల్లా సోషల్‌మీడియా విభాగం అధ్యక్షుడిగా సత్యమోహన్



అంబాజీపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా అంబాజీపేటకు చెందిన దొమ్మేటి సత్యమోహన్‌ను నియమించారు. పార్టీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు అందినట్లు సత్యమోహన్ తెలిపారు. ఈసందర్భంగా సత్యమోహన్ నియమాకంపై పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభినందించారు.

గురుకులాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు

అల్లవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గోడి బాలుర గురుకుల కళాశాల, పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో చేసుకోవాలని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ అన్నారు. 5వ తరగతిలో చేరడానికి ప్రస్తుతం 4వ తరగతి చదువుతుండాలని, ఇంటర్‌లో ప్రవేశానికి ఈనెల7వ తేదీ నుంచి మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జరిమానా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని అమలాపురం పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం అమలాపురం మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. ఒక్కొక్కరికీ రూ.11వేలు చొప్పున రూ.55వేలు జరిమానా విధించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అతివేగంగా మోటారుసైకిల్ నడుపుతున్న వ్యక్తికి రూ.వెయ్యి జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు వితరణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన విశ్రాంత గెజిటెడ్ హెచ్‌ఎం పితాని వీరవెంకటసత్యనారాయణ ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొదటి మూడుస్థానాలు సాధించిన విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామర్, తెలుగు గ్రామర్, ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందించారు. 1984నుంచి ప్రతీ ఏడాది ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుస్తకాలు అందించి వారిని ప్రోత్సహిస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.హనుమంతరావు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

పెరవలి/మామిడికుదురు, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పెరవలి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మామిడికుదురు గ్రామానికి చెందిన 70ఏళ వృద్ధుడు పల్ల బాలయోగి సుబ్బారావు ఈనెల2న తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరులోని చెల్లెలు ఇంటికి వచ్చాడు. ఈనెల3న పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం వేడంగిపాలెం బంధువుల ఇంటికి వెళతానని ఇంటి నుంచి బయలు దేరి వెళ్లాడు. అయితే అతడు బంధువుల ఇంటికి చేరలేదు. అతడు ఆచూకీ తెలియక పోవడంతో బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

తనూష్‌తేజకు అభినందనల వెల్లువ

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మలతో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ శకట నృత్య బృందంలో పాల్గొన్న గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థి మదిర తనూష్‌తేజను అభినందిస్తూ గురువారం కార్యక్రమం జరిగింది. కూచిపూడి నేర్చుకుంటున్న తనూష్‌తేజకు గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కడంపై హెచ్‌ఎం లంక రాణి ఆనందం వ్యక్తంచేశారు. పీఎంసీ ఛైర్మన్ వాలా సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేధావుల విభాగం అధ్యక్షుడిగా హుస్సేన్



మామిడికుదురు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైసీపీ మేధావుల విభాగం అధ్యక్షుడిగా నగరం గ్రామానికి చెందిన ఆగాబాకర్ హుస్సేన్‌ను నియమిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలతో పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా రావులమ్మ పంట జాతర

అంబాజీపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే ఇలవెల్పుగా ఉన్న గ్రామదేవత గంగలకుర్రుఅగ్రహారం శ్రీరావులమ్మ అమ్మవారి పంట జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవార్కి నైవేద్యాలను యువకులు, కాపు సామాజిక వర్గీయులు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ప్రతి ఏడాది మాఘమాసంలో అమ్మవారి పంట జాతరకు తొలిపంటలో వచ్చిన పంటలను నైవేద్యాలను అమ్మవార్కి చెల్లించుకుంటారు. జాతరకు ముందు 15 రోజుల నుంచి అమ్మవారిని గ్రామంలో ప్రతీ రోజు గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం జాతర సందర్భంగా ఉదయం అమ్మవార్కి పెరుగు అన్నం నైవేద్యంగా తయారుచేసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బుట్టలో వేశారు. అనంతరం ఆ నైవేద్యాన్ని తాడిచెట్టు వద్ద ఉంచారు. సాయంత్రం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నైవేద్యాన్ని మట్టి కుండంలో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవార్కి సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. పంటలు అభివృద్ధి చెందాలని రైతులు, గ్రామస్తులు ఈపంట జాతరను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా ఉదయం నుంచి అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వెండి ఆభరణాలు బహూకరణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో ఉన్న శ్రీమహాగణపతి సీతాసమేత శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణ, ఆంజనేయస్వామివార్లకు భక్తులు రూ.2లక్షలు విలువైన వెండి ఆభరణాలను కానుకగా సమర్పించారు. తాడి పెదనరసింహారావు, తాడి చిననరసింహారావు, తాడి కాశీవిశ్వేశ్వరరావుల ఆధ్వర్యంలో దాతలు గురువారం వెండి ఆభరణాలు సమర్పించగా అర్చకులు సుదర్శనం శ్రీరామచిరంజీవాచార్యులు సంప్రోక్షణ నిర్వహించి స్వామికి అలంకరించారు.

సుమిత్ రామారావు వర్ధంతి

రాజోలు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోషల్ వర్కర్, న్యాయవాది యాలంగి రమేష్ తనయుడు సుమిత్ రామారావు పదో వర్ధంతిని గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శాంతకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డిప్యూటీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు హాజరయ్యారు. సుమిత్ రామారావు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. న్యాయవాది రమేష్ సమకూర్చిన పరీక్ష అట్టలను మాజీ డిప్యూటీ స్పీకర్ సూర్యనారాయణరాజు చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం సత్యసాయి సేవా సమితి తరఫున సాయిబాబు వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎంఈవోలు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, బోళ్ల వీరవెంకటభద్రం, దార్ల పాపయ్యచారి, వైస్ ప్రిన్సిపాల్ కె.గణేశ్వరరావు, జె.రాజబాబు, ఐ.సువర్ణరావు పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘానికి పన్ను బకాయి పడ్డ వారికి పురపాలక సంఘం తరఫున రెడ్ నోటీసులు జారీ చేసినట్టు కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. కొంతకాలంగా కుళాయి పన్నులు, ఇంటి పన్నులు చెల్లించనివారికి నోటీసులు జారీ చేశామన్నారు. గురువారం పట్టణంలోని పది గృహాలకు తాగునీటి కుళాయి కనెక్షన్లు తొలగించగా ఎనిమిది గృహాల యజమానులు పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించినట్టు రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. బకాయిలు చెల్లించిన వారికి కుళాయిలు రీకనెక్షన్లు ఇచ్చామన్నారు. రెడ్ నోటీసులు జారీ చేసిన తర్వాత పన్ను బకాయిదారులు వెంటనే పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

వాట్సాప్ మెసేజ్‌తో సమస్యకు పరిష్కారం

కలెక్టర్ ఆదేశాలతో విద్యార్థులకు లైఫ్‌జాకెట్లు పంపిణీ



ఐ.పోలవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి పాయ దాటి ప్రతినిత్యం పడవలపై ప్రయాణం చేస్తున్న విద్యార్థులకు తుపాన్లు, వరదల సమయంలో ప్రాణ గండమే కదా? కాట్రేనికోన మండలం బలుసుతిప్పకు చెందిన 95 మంది విద్యార్థులు ఐ.పోలవరం మండలం జి.మూలపొలం హైస్కూల్లో చదువుకుంటున్నారు. వీరు ప్రతిరోజూ పడవపై గోదావరి పాయ దాటి బడికి వస్తుంటారు. వరదలు, తుపాన్ల సమయంలో వీరి ఇబ్బందులను గుర్తించిన హెచ్‌ఎం కొమ్మన జనార్ధనరావు సమస్యను డీఈవో షేక్ సలీంబాషా దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు లైఫ్‌జాకెట్లు ఇవ్వాలంటూ డీఈవో జిల్లా కలెక్టర్‌కు వాట్సాప్ మెసేజ్ పంపించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ మహేష్‌కుమార్ మూడు రోజుల్లో లైఫ్‌జాకెట్లు మంజూరుచేశారు. ఫలితంగా జి.మూలపొలం పాఠశాలకు చెందిన 95మంది, మురమళ్ళ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 23మంది విద్యార్థులకు లైఫ్‌జాకెట్లు సమకూరాయి.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ఈశ్వరమ్మ ఆలయంలో శ్రీరుక్మాంబ సమేత పాండురంగస్వామి పంచాయాతన సంపూర్ణ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గురువారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు శ్రీమాన్ సుదర్శనం వెంకటజనార్ధనాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నవకలశారాధన, చతుర్దశ కలశారాధన, అగ్నిప్రతిష్ఠాపన, పంచగవ్యాదివాస, క్షీరాదివాసం, జలాదివాసం, మధ్యాహ్నం ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాలు, డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఊరేగించారు. రాత్రి అగ్నిమథనం, కుంభపూజ వంటి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విళ్ల ఈశ్వరరావు-మాధవి, విళ్ల గణేష్-సౌజన్య దంపతులతో పునర్నిర్మించిన ఆలయంలో తొమ్మిది మంది యాజమాన్య దంపతులు ప్రతిష్ఠా మహోత్సవ పూజలు నిర్వహించారు. పూజాకార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, టీడీపీ నాయకులు దాట్ల పృథ్విరాజ్, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, విళ్ల వీరాస్వామినాయుడు, పిల్లి నాగరాజు, తాడి జానకీరామ్, గొల్లపల్లి గోపి, మాదాల బుజ్జి, బూరుగ కల్యాణ్, యాళ్ల ఉదయ్ పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్‌కు ఎంపికైన తేజస్వికి సన్మానం

అమలాపురంరూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి గ్రామానికి చెందిన కుంపట్ల పూర్ణతేజస్వి బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో గురువారం అమలాపురం హెల్త్‌అండ్‌ఫిట్‌నెస్ జిమ్‌లో సన్మానోత్సవం నిర్వహించారు. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు ఆధ్వర్యంలో తేజస్వికి పూలమాలలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.రాజరాజేశ్వరి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశ రక్షణలో భాగస్వామి అయి అస్సాం రెజిమెంట్‌లో బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైన తేజస్వికి అభినందనలు తెలిపారు. ఆమె తండ్రి కేఎస్వీ సత్యనారాయణ, బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, సీహెచ్ రాజబాబు, ఎంవీ సముద్రం, మెహనాజ్, లలిత, సి.సాగర్, ఎం.సుధాకర్ బాబు, జిమ్ క్రీడాకారులు, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంటబోదెలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

-ప్రమాదంలో లంకలగన్నవరం సర్పంచ్‌కు తీవ్రగాయాలు

పి.గన్నవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బెల్లంపూడిలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పంటబోదెలోకి దూసుకువెళ్లింది. లంకగన్నవరం గ్రామ సర్పంచ్ రామకృష్ణ ద్విచక్ర వాహనంపై బుధవారం తాడేపల్లిగూడెం బంధువులు ఇంటికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా అర్ధరాత్రి సమయంలో బెల్లంపూడి పెట్రోలు బంకు సమీపంలో ద్విచక్ర వాహనం పంటబోదెలోకి దూసుకుపోయింది. దీంతో రెండు గంటలు తర్వాత స్థానికులు గమనించి అతడ్ని ఒడ్డుపైకి తీసుకువచ్చారు. అయితే సర్పంచ్ వివరాలు తెలియకపో వడంతో తెల్లవారే వరకు రోడ్డుపైనే ఉంచారు. అనంతరం పి.గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ప్రతీ ఓటరును కలవాలి

మలికిపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఓటరును ఇన్‌చార్జిలు తరచూ కలవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సభలో ఆయన మాట్లాడుతూ పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసేలా ఓటర్లను చైతన్యం చేయాలన్నారు. ప్రతీ 30మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించామని, ఆ ఇన్‌చార్జి ప్రతీ ఓటరును తరచూ కలిసి రాజశేఖర్‌కు ప్రాధాన్యతా ఓటు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, మల్లిపూడి సత్తిబాబు, అడబాల రాంబాబు, చాగంటి స్వామి పాల్గొన్నారు.

ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో విజయసాధన తథ్యం

అల్లవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థుల విజయసాధనకు ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం ముఖ్యమని డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో కోనసీమ సైన్స్‌పరిషత్ మహాసభలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రతీ విద్యార్థి ఉత్తమ సాంకేతిక నిపుణునిగా ఎదిగే లక్ష్యంతో అనేక నైపుణ్యాలు నేర్చుకోవాలన్నారు. సైన్స్ సూత్రాలను వస్తు రూపంలో మలిచి ఉపయోగకరమైన సాధనాలు కనిపెట్టాలన్నారు. డాక్టర్ సర్వేశ్వరశర్మను బీవీసీ విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రవీణ్, శ్రీపాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండపేట

ఆక్రమణల్లో బస్టాండ్లు

- అధ్వానంగా మరుగుదొడ్లు
- పట్టించుకోని అధికారులు



ఆక్రమణల చెరలో వద్దిపర్రు బస్‌షెల్టర్



ఆత్రేయపురం బస్‌స్టేషన్‌లో నిరుపయోగంగా మరుగుదొడ్లు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం, సుఖమయమంటూ ఏపీఎస్ ఆర్టీసీ విస్తృత ప్రచారం కల్పిస్తోంది. ప్రయాణికులకు మాత్రం సౌకర్యాలు కల్పించడంలో గుట్టుగా విఫలమవుతున్నారు. బస్‌స్టేషన్‌లో, బస్‌షెల్టర్లలో సౌకర్యాలు కల్పించడంలో ఆసంస్థ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు రోడ్ల పక్కనే నిల్చుని బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రైవేట్ వాహనాల వైపు ప్రయాణికులు పరుగులు పెడుతున్నారు. ఆత్రేయపురం బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు ఎటువంటి సౌకర్యాలు లేవు. మహిళలు అయితే చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. బస్సు కోసం వేచి ఉండే సమయంలో ఫ్యాన్లు, కుర్చీలు కూడా లేకపోవడంతో ఎండవేడి తట్టుకోలేక ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. ప్ర యాణికులు దాహార్తిని నింపుకునేందుకు బస్‌స్టేషన్‌లో చేతిపంపు కూడా ఏర్పాటుచేయలే దు. రాత్రి వేళల్లో ఆకతాయిలు, మందు పార్టీ లు చేసుకుంటున్నారు. బస్‌స్టేషన్‌లో పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. బొబ్బర్లంక నుం చి మెర్లపాలెం వైపు ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్రభుత్వ, దాతల సహకారంతో నిర్మించిన బస్‌షెల్టర్లు ఆక్రమణదారుల చేతిలో ఉన్నాయి. బస్‌షెల్టర్ల పక్కనే చిరువ్యాపారులు ఆక్రమించుకుని షాపులు పెట్టుకోగా మరికొంత మంది తమ వాహనాలను భద్రపరుచుకుంటున్నారు. బస్‌షెల్టర్లను వ్యాపార అడ్డాగా చేసుకోవడంతో ప్రయాణికులు రోడ్డుమీదే నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆత్రేయపురం రేవులో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికుల బాధలు వర్ణణాతీతం. ఆర్టీసీ సంస్థ అల్ట్రా, పల్లె వెలుగు బస్సుల పేరుతో సర్వీసులను నడిపి రావులపాలెం నుంచి ఆత్రేయపురం మీదుగా రాజమహేంద్రవరానికి రూ.5చార్జీ అదనంగా వసూళ్లు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆక్రమణదారుల చెరలో ఉన్న బస్‌షెల్టర్లను తక్షణమే స్వాధీనం చేసుకుని ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.



సైకిల్‌స్టాండుగా మారిన వెలిచేరు బస్‌షెల్టర్

రోడ్డు భద్రతా మాసోత్సవాలపై విద్యార్థులకు అవగాహన

మండపేట, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి రోడ్డుప్రమాదాలు గురించి అవగాహన అవసరమని మండపేట ఎంపీఏ ఎస్.లక్ష్మీశ్రీదేవి అన్నారు. మండపేట పట్టణంలో వున్న శశి పాఠశాలలో గురువారం రవాణాశాఖ మాసోత్స వాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు.



ఆలమూరులో ఎలుకల బొరియలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



ద్రాక్షారామలో : ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



రాయవరం: వెంటూరులో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న ఏవో ప్రభాకర్

వరిసాగులో ఎలుకల నివారణ కీలకం

- జిల్లా వ్యవసాయాధికారులు
- రైతులకు సూచనలు

ఆలమూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజోతి): వరిసాగులో ఎలుకల వల్ల భారీ నష్టం జరుగుతుందని వీటిని సమర్ధవంతంగా నివారించడం సాగులో కీలకమని జిల్లా వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. మండలంలోని మోదుకూరులో గురువారం సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు, ఆర్ఎస్‌కె డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డి.వెంకటేశ్వర్లు పాల్గొని రైతులకు ఎలుకల నివారణ మందు ఎరను పంపిణీ చేశారు. పంటభూములలో ఎలుకల బొరియలు ఎలా ఉంటాయి వాటిలో మందు ఎరను ఎలా ఉపయోగించాలనే విషయాలను రైతులకు వివరించారు. ఎలుకల వల్ల వరిపంటకు భారీ నష్టం ఉంటుందని అందువలన సకాలంలో రైతులంతా సామూహికంగా ఎలుకల నివరణ చర్యలు చేపట్టాలని వారు చెప్పారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి, ఆలమూరు ఏడీఏ కాకి నాగేశ్వరరావు, ఏవో సోమిరెడ్డి, లక్ష్మీలావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకలు నిర్మూలించాలి

ద్రాక్షారామ: ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో నిర్వహించిన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎలుకలతో పంటలకు తీవ్రనష్టం చేకూరుతుందన్నారు. ఎలుకల జీవన చక్రం, ఎలుకలు పంటకు చేయునష్టం గురించి వివరించారు. రైతులతో ఎలుకల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైతులకు ఎలుకల మందు,నూకలు కలిపిన విశ్రమాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ పి.డి వై.జ్యోతిర్మయి. డాట్ శాస్త్రవేత్త నందకిషోర్, ఏడీఏ ఏ.వి.ఎస్ రంగారావు, వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్, వ్యవసాయశాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనకు రైతులు సహకరించాలి

కె.గంగవరం: వరి పంటకు తీవ్రనష్టం కలిగిస్తున్న ఎలుకలను నిర్మూలించడానికి రైతులు సహకరించాలని మండల వ్యవసాయశాఖ అధికారి బలుసు రవి అన్నారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద ఎలుకల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గంగవరంలో జరిగిన కార్యక్రమంలో ఏవో పాల్గొన్నారు. రైతులతో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయశాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఒకేసారి ఎలుకల నివారణ చేపట్టాలి

రాయవరం: రైతులంతా ఒకేసారి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వెంటూరు, చెల్లూరు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు వరి పంట వేసిన నాటి నుంచి కోతలు జరిగే వరకు ఎలుకలు పొలాలపై దాడిచేసి అపారమైన నష్టాన్ని కలుగజేస్తాయన్నారు. అనంతరం ఏవో రైతులకు ఎలుకల నివారణ మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



కె.గంగవరంలో ఎలుకల మందును రైతులకు పంపిణీ చేస్తున్న ఏవో రవి

బీజేపీ మండలాధ్యక్షుడిగా దుర్గా శ్రీనివాస్ ఎన్నిక



లొల్లలో దుర్గా శ్రీనివాస్‌ను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రాయవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం బీజేపీ అధ్యక్షుడిగా శాకా దుర్గా శ్రీనివాస్ తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని లొల్ల గ్రామంలో గురువారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సా యిరాం అధ్యక్షతన జరిగిన ఎన్నిక కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా గొడవర్తి రామచంద్రరావు వ్యవహరించారు. బీజేపీ నాయకులు తిరిగి రెండోసారి తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు దుర్గాశ్రీనివాస్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత లు అప్పగించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ బాల సత్యనారాయణ, నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు దుర్గా శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. మండలాధ్యక్షుడిగా ఎన్నికైన దుర్గా శ్రీనివాస్‌ను బీజేపీ నాయకులు నరాల రాంబా బు, చింతా తమ్మిరెడ్డి, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు తదితరులు అభినందించారు.

మండపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా నాళం ఎన్నిక



నాళం పణిప్రకాష్

మండపేట: మండపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఎన్నిక గురువారం స్థానిక నాళంవారి సత్రంలో జరిగింది. పార్టీ పరిశీలకులు పాలూరి సత్యానందం మండపేట అర్బన్ ఎన్నికల అధికారి నరాల రాంబాబుల సమక్షంలో జరిగిన ఎన్నికలో పార్టీ అధ్యక్షుడిగా నాళం పణిప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఇప్పటివరకు పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన ఎం.సుబ్బారావుకు అందించినట్టుగానే ప్రకాష్‌కు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. నూతనంగా ఎన్నికైన ప్రకాష్ మాట్లాడుతూ అందరి సహకారంతో పార్టీబలోపేతానికి పని చేస్తానని చెప్పారు. నియోజకవర్గ బీజేపీ కన్వీ నర్ కె.సాయిరాం, కె.మురళీకృష్ణ, వల్లబనేని రవీంద్ర, జి.రామచంద్రరావు, కె.శ్రావణి, కె.కృష్ణమాచార్యులు, పి.రమణ పాల్గొన్నారు.

పోస్టుకార్డు ద్వారా మోదీకి ధన్యవాదాలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 2025 కేంద్ర బడ్జెట్‌ను భారతీయలు మెచ్చేలా ప్రకటించినందుకు ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలియజేస్తూ పోస్టుకార్డు రాయించే థ్యాంక్యు కార్యక్రమం నిర్వహించా రు. గురువారం ఆత్రేయపురంలో అన్నివర్గాల ప్రజలతో మమేకమై నూతన బడ్జెట్ వారి అభిప్రాయాల రూపంలో ప్రధానమంత్రి కార్యాలయానికి పంపించే కార్యక్రమం పోస్టుకార్డు ద్వారా నిర్వహించారు. బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శిష్టా సూర్యకుటుంబరావు, కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ చేకూరి రమేష్‌వర్మ, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడవల్లి రాంబాబు పాల్గొన్నారు.



పోస్టుబాక్సులో పోస్టుకార్డు వేస్తున్న బీజేపీ నాయకులు

నేటి నుంచి నవజనార్ధనస్వామి కల్యాణోత్సవాలు

- నేటి రాత్రికి కల్యాణానికి ఏర్పాట్లు



ఆలమూరులో ఉన్న జనార్ధనస్వామి

ఆలమూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):, నవజనార్ధనస్వామి ఆలయాల లో ఒకటైన ఆలమూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 7నుంచి 13వరకు ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈనెల 7న రాత్రి 8.00గంటలకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కార్యానిర్వహణాధికారి ఎంఎస్ఆర్ కృష్ణ సమక్షంలో నిర్వహించేందుకు సిద్ధం చేశారు. ముందుగా స్వామివారిని గరుఢ వాహనంపై సన్నాయిమేళాలు, బాణాసంచా కాల్పులతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 8న స్వామి రథోత్సవం 2.30కు ప్రారంభమవుతుంది. అదేరోజు తీర్ధమహోత్సవం జరుగుతుందని ఈవో ఎంఎస్ఆర్ కృష్ణ తెలిపారు. 9న సదస్యం, 10న గజవాహనంపై స్వామి గ్రామోత్సవం, 11న హంసవాహనంపై ఊరేగింపులు జరుగుతాయని 12న స్వామివారికి చక్రస్నానం, 13న పుష్పోత్సవంలు జరుగుతాయని ఆయన చెప్పారు. ఈనెల 8న జరుగనున్న రథోత్సవం తిలకించడానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. రథోత్సవం జొన్నాడ-ఆలమూరు రోడ్డులో జరుగనుండడంతో ఆరోజు మధ్యాహ్నం ట్రాఫిక్ ఆంక్షలు విధించి పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నారు.

జనార్ధనస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



జనార్ధనస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మండపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రథంగుడి సెంటర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామివారి తిరు కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవల్లి గోపాలకృష్ణావాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సాయంత్రం విష్వక్సేనాపూజ, అంకురార్పణ, ధ్వజరోహణం, స్వామివారిని పెండ్లి కుమారుడిని చేశారు. అనంతరం అగ్నిప్రతిష్ఠాపన బలిహరణ కార్యక్రమాలను చేశారు. కల్యాణ ఉత్సవాలు ప్రారంభం నేపథ్యంలో తొలి రోజు భోగ జనార్ధనస్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఈవో కామేశ్వరరావు కల్యాణోత్సవ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.53లక్షలు



వాడపల్లి వెంకన్న ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,53,532 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

నామినేషన్ వేయడానికి వెళ్లిన ఎమ్మెల్సీ అభ్యర్ధి రాఘవులు



జొన్నాడ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులు

ఆలమూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల అభ్యర్థిగా పోటీచేస్తున్న యూటీఎఫ్ నాయకుడు డీవీ.రాఘవులు గురువారం ఆలమూరు మండలం జొన్నాడవద్ద నుంచి ర్యాలీగా నామినేషన్ వేయడానికి ఏలూరు వెళ్లారు. ముందుగా జొన్నాడ వద్ద జాతీయరహదారి పక్కన ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం యూటీఎఫ్ నాయకులతోపాటు పలువురు నాయకులు, ఆయన అభిమానులతో ఏలూరుకు ర్యాలీగా బయలుదేరారు.

వీఆర్వోలకు డీడీవోగా తహశీల్దారు ఉండాలి



డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రాన్ని అందిస్తున్న వీఆర్వోలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వీఆర్వోలకు డీడీవోగా తహశీల్దార్లు ఉండాలని వీఆర్వోలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులకు డీడీవోలుగా వీఆర్వోలు ఉండటంవల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తద్వారా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అనంతరం ఉప తహశీల్దారుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గిరి, జ్యోతి, హైమావతి, భవాని, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు శిక్షణ



సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

రావులపాలెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండల పరిషత్ సమావేశపు హాలులో మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సర్వేల ప్రగతి నివేదికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు వారికి పలు అంశాలను వివరించి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

తాపేశ్వరం పోలమూరు పంటకాల్వకు మరమ్మతులు

మండపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలం లోని తాపేశ్వరం, అనపర్తి మండలం పోలమూరు వ్యవసాయ భూములకు సాగునీరు అందించే నెం4 చానల్ పంటకాల్వ తూడుతో పూడుకపోవటంతో సాగునీటి సరఫ రాకు అంతరాయం కలుగుతుంది. ఈనేపథ్యంలో రైతులు సంబంధిత ఇరిగేషన్‌శాఖ, సాగునీటిసంఘం సభ్యులను ఆశ్రయించటంతో పంటకాల్వలో తూడు తొలగింపు పనులకు అనుమతించారు. దాంతో సుమారు 6 కిలోమీటర్ల మేర పంటకాల్వలో తూడు తొలగింపు పనులు చేపట్టారు. ఈకాల్వ ద్వారా 800 వరి పంటకు సాగునీరు అందుతుందని తాపేశ్వరం ఇరిగేషన్ జేఈ అజీజ్ తెలిపారు. రైతులకు సాగునీరు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు తూడుతొలగింపు పనులను రెండురోజుల నుంచి చేస్తున్నామని ఆయన తెలిపారు.

నాయీ బ్రాహ్మణుల సంఘం కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన రామకృష్ణ

ఆలమూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండల నాయీ బ్రాహ్మణుల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా చింతలూరుకు చెందిన చోడవరపు రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా దుగ్గదుర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పాలవులూరి దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా జొన్నాడ నాగవెంకటరాంబాబు, కోశాధికారిగా తణుకు వీరవెంకటసత్యనారాయణతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

కూటమి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల నుంచి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంను గెలుపేలక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్ర ఈసీ కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కూటమి నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండపేట పట్టణ టీడీపీ కార్యాలయంలో గురువారం వేగుళ్ల అధ్యక్షతన నియోజవర్గస్థాయిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం గెలుపుపై కూటమి నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర పరిశీలకుడిగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజానరమేష్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓటు రాజశేఖరంకు వేసేలా పనిచేయాలని కూటమినేతలకు రాజానరమేష్ పిలుపునిచ్చారు. గతంలో వైసీపీ ప్రభుత్వం యువతను మోసం చేసిందని కూటమి ప్రభుత్వం త్వరలోనే నిరుద్యోగులకు ఉపాధి కల్పన చేసేందుకు కట్టుబడి ఉందని జిల్లా పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్, గ్రంథాలయ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, ఉంగరాల రాంబాబు, కూటమినేతలు, జనసేన టీడీపీ, బీజేపీ శ్రేణులు సమావేశంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి ప్రచారం

ఆత్రేయపురం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషిచేయాలని కోరుతూ కూటమినేతలు ప్రచారం నిర్వహించారు. గురువారం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే తనయుడు బండారు సంజీవ్ ఆధ్వ ర్యంలో పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కొత్తపేట నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పొలిపర్తి వెంకటగణేష్‌కుమార్, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ సమితి అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాస్, కాయల జగ్గనాధం, అడ్డగళ్ల ప్రసాద్, యేపుగంటి వెంకటేష్, కాశీ కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం పట్టణంలో పలు ప్రైవేటు పాఠశాలల్లో గురువారం కూటమి నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి పెంకె శ్రీనివాస్ బాబా ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లాల గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొత్తపేట: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి గురువారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కళానగర్ వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రచారంలో పాల్గొన్నారు. పట్టభద్రులను కలిసి తమ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు పోలపర్తి వెంకటగణేష్‌కుమార్, కంఠంశెట్టి శ్రీను, ధర్నాల రామకృష్ణ, బూజి జయలక్ష్మిభాస్కరరావు, ముత్యాల బాబ్జి, పాలూరి సత్యానందం, విళ్ళ మారుతీప్రసాద్, గుబ్బల మూర్తి, బీర ఇసాక్, యల్లమిల్లి జగన్మోహన్, మిద్దే ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

రావులపాలెం: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు నాయకులు ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీడీపీ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ యువ నాయకులు బండారు సంజీవ్, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, జి. పట్టాభిరామారావు, కాసా సాగర్, మాసాబత్తుల ఆనందరావు తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా తోట సత్తెమ్మ తల్లి జాతర

కె.గంగవరం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): సత్యవాడ గ్రామ దేవత తోట సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలన్నీ విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేకపూజలు చేశారు. గరగ నృత్యాలు, కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భారీ అన్నసమారాధన చేశారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైసీపీ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ పంపన నాగమణిలు, మాజీ జెడ్‌పీటీసీ మేడిశెట్టి రవి కుమార్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కూటమి నాయకులు గంధం పళ్లం రాజు, తోట వెంకన్న, సలాది రమేష్, సలా ది వెర్రిబాబు, సలాది ప్రకాష్, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకు ని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరంఅన్నసమారాధన నిర్వహించారు.

మండపేట-ఏడిద రోడ్డు పనులు ప్రారంభం

మండపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో గురువారం రోడ్డు ఇలావుంటే ప్రయాణం ఏలా అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు రహదారులు భవనాల శాఖాధికారులు స్పందించారు. మండపేట ఏడిద, దుళ్ల మధ్య రోడ్డుపై రాళ్ల తేలిపోయి గోతులు పడి ప్రమాదకరంగా మారటంతో సమస్యను ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావటంతో అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి గురువారం రోడ్డు మరమ్మతు పనులను చేపట్టారు. మండపేట నుంచి ఏడిద దుళ్ల మధ్య రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఊరట చెందుతున్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఉత్తమ సేవా పురస్కారాల అందజేత



ఉత్తమసేవా పురస్కారాలు అందుకుంటున్న డా. ప్రశాంతి, కమల్‌శేషు

ద్రాక్షారామ,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపికైన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులకు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఉత్తమసేవా పురస్కారాలు అందజేశారు. జిల్లావైద్య ఆరోగ్య శాఖాధికారి డా.దుర్గారావుదొర చేతులమీదుగా రామచంద్రపురం డివిజినల్ వైద్యాధికా రిణి, ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యురాలు ఎన్.ప్రశాంతి, డివిజినల్ పర్యవేక్షకులు, వెల్ల పీహెచ్‌సీ పర్యవేక్షకుడు జి.కమల్‌శేషు, ఏఎన్ఎం సుబ్బలక్ష్మీ, ఆశావర్కర్ సుజాతలకు ప్రశంసాపత్రాలు అందజేసినట్లు డాక్టర్ ప్రశాంతి తెలిపారు.

హౌస్‌హోల్డ్ సర్వేలో పెండింగ్ అంశాలు పూర్తి చేయండి : ఎంపీడీవో

కె.గంగవరం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలో నిర్వహించిన హౌస్‌హోల్డ్ సర్వేలోని పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దీనిలో ఆయన సచివాలయాల వారీగా పెండింగ్ అంశాలు సిబ్బందికి అందజేశారు. రెండు రోజుల్లో పెండింగ్ అంశాలు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ సురేంద్రరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్, ఎంఈవో1 ఏ.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.